# బౌరంపేట దళితులకు న్యాయం జరిగే వరకూ పోరాటం ఆగదు: ఎంపీ ఈటెల రాజేందర్

కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 10(వాయిస్ టుడే): బౌరంపేట్ దళితులకు న్యాయం జరిగే వరకూ పోరాటం ఆపేది లేదని మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ స్పష్టం చేశారు. గురువారం ఆయన మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా దుండిగల్ గండి మైసమ్మ మండలం లోని బౌరంపేట ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక దళితులు సర్వే నెంబర్ 472 ఎర్రమన్ను బొందల స్థలాన్ని సందర్శించారు. అక్కడే ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన బౌరంపేట దళితులను ఉద్దేశించి ప్రసంగించారు. బౌరంపేట్ మాజీ సర్పంచ్, బిజెపి జిల్లా ఉపాధ్యక్షురాలు కొమ్ము మంగమ్మ అధ్యక్షతన ఈ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా వ్యవసాయం జీవనాధారంగా చేసుకొని జీవించిన దళితులకు ప్రభుత్వం ఏ పరిహారం ఇవ్వకుండానే అసైన్మెంట్ స్థలాలను వాపస్ తీసుకోవడం ధర్మం కాదని అన్నారు. దుండిగల్ లో అసైన్మెంట్ స్థలాలను ప్రభుత్వం తీసుకుంటున్న ప్రస్తుత తరుణంలో ప్రతి ఎకరాకు అసై నీకు 700 గజాల స్థలాన్ని అభివృద్ధి చేసి ప్రభుత్వం ఇవ్వడానికి ఒప్పుకుందని అన్నారు. అలాగే బౌరంపేట్ లో సర్వే నెంబర్ 472 లో కూడా ఇదే విధానాన్ని పాటించి ప్రతి ఎకరా నుండి అసైనీదారులకు 1000 గజాల స్థలాన్ని అన్ని హక్కులతో అసైన్ మెంట్ దారులకు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా బౌరంపేట దళితులకు ప్రభుత్వం నుండి పరిహారంగా భూమి పొందే వరకు ఎవరు విశ్రమించవద్దని పిలుపునిచ్చారు. జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ మల్లారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దళితుల పట్ల వివక్ష చూపవద్దని న్యాయంగా వారికి అందాల్సిన నష్టపరిహారం ఇప్పించేంతవరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. సభకు అధ్యక్షత వహించిన బౌరంపేట మాజీ సర్పంచ్, బిజెపి జిల్లా ఉపాధ్యక్షురాలు కొమ్ము మంగమ్మ మాట్లాడుతూ ఇంతవరకు సర్వేనెంబర్ 472లో వ్యవసాయం చేసుకుని కుటుంబాన్ని నెట్టుకొచ్చిన వారు నేడు



ప్రభుత్వం వ్యవసాయం చేయకుండా ఆపడంతో ఉపాధిని కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక్కో ఊరికి ఒక్కో న్యాయం చేయవద్దని, దుండిగల్ అసైనీదారులకు ఏమాదిరిగా పరిహారం ఇస్తున్నారో అదే మాదిరిగా ప్రతి ఎకరాకు ఒక వెయ్యి గజాలు స్థలాన్ని దళితులకు కూడా ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. సమావేశంలో బిజెపి దుండిగల్ సర్కిల్ అధ్యక్షుడు పీసరి కృష్ణారెడ్డి, సీనియర్ నాయకుడు నల్ల రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీటీసీ జంగారెడ్డి లు ప్రసంగించారు. కార్యక్రమంలో బౌరంపేట్ సర్వే నెంబర్ 166 కు చెందిన అసైని దారులు కూడా హాజరై తమకు కూడా ఎలాంటి పరిహారం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించలేదని ఈటెల రాజేందర్ కు ఫిర్యాదు చేశారు. సర్వే నెంబర్ 166 లో మొత్తం 450 ఎకరాలు స్థలం ఉండగా అందులో పోలీస్ డిపార్ట్మెంట్ కు 50 ఎకరాలు, స్మశాన వాటికకు 10 ఎకరాలు, డంపింగ్ యార్డ్ కు 10 ఎకరాలు, డబల్ బెడ్రూమ్స్ ఇళ్లకు 10 ఎకరాలు కేటాయించినట్లు వారు ఎంపీ ఈటెల రాజేందర్ కు వివరించారు. సుమారు 140 ఎకరాలు ప్రస్తుతం వ్యవసాయం చేసుకుంటున్న రైతుల అదుపులో భూమి ఉన్నట్లు తెలిపారు. దీంతో సర్వే నెంబర్ 166 అసైన్మెంట్ దారులకు కూడా న్యాయం జరిగే వరకూ పోరాటం చేద్దామని మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ హామీ ఇచ్చారు. కార్యక్రమానికి బౌరంపేట దళితులు వందలాదిగా హాజరయ్యారు. నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి ఈ సమావేశానికి రానున్నారని ప్రచారం జరిగిన ఆయన ఈ సమావేశానికి రాలేదు. ఈ సమావేశంలో బౌరంపేట దళిత నేతలు డప్పు కృష్ణ, బాలా నరసింహ, కొమ్ము యాదయ్య, చింతకింది రమేష్, చింతకింది ముత్తమ్మ, కొమ్ము వీరయ్య, బలగారి మల్లేష్, చింతకింది రాము లమ్మ, అగ్రి నరసింహ, పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు.



## ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటూ..

### 2,75,000 విలువైన ఎల్ఓసి చెక్‌ను మంజూరు చేయించిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

కుత్బుల్లాపూర్, సెప్టెంబర్ 10(వాయిస్ టుడే): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, ప్రగతినగర్‌కు చెందిన గొల్ల అశోక్ యాదవ్ అనారోగ్యంతో బాధపడుతూ వైద్య చికిత్స పొందుతున్నారు. ఈ విషయం కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ ఎల్పీ విప్ కేపీ వివేకానంద్ దృష్టికి తీసుకురాగా, ఆయన వెంటనే స్పందించి ముఖ్యమంత్రి సహాయనిధి ( ఎల్ఓసి) ద్వారా ?2,75,000/- ఆర్థిక సహాయం మంజూరు చేయించారు. ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ద్వారా మంజూరైన ?2,75,000/- విలువైన ఎల్ఓసి చెక్‌ను భౌరంపేట్ మాజీ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి గొల్ల అశోక్ యాదవ్ కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు అండగా నిలుస్తూ, వైద్య చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందేలా కృషి చేస్తున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి, అవసరమైన సహాయం అందేలా ఎల్లప్పుడూ కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దర్శన్ యాదవ్ వికాస్ యాదవ్ సమ్మయ్య మరియు గొల్ల అశోక్ యాదవ్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## స్పీకర్ గడ్డం ప్రసాద్ తల్లిని కులం పేరుతో దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలి

### షెడ్యూల్డ్ కాస్ట్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం



హైదరాబాద్, సెప్టెంబర్ 10;( వాయిస్ టూ డే): అసెంబ్లీ సమావేశంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ తల్లిని కులం పేరుతో అసభ్య పదజాలంతో దూషించిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు,చైర్మన్ గాలిపల్లి కృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు సికింద్రాబాద్ జోన్ డిసిపి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అసెంబ్లీ సమావేశంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ తల్లిని కులం పేరుతో అవమానించిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు. అలాగే మహిళలను కించపరిచే విధంగా మాట్లాడిన వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సామాజిక వర్గాలపై అవమానకర వ్యాఖ్యలు చేయడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని, ప్రజా ప్రతినిధులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని గాలిపల్లి కృష్ణ అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని "షెడ్యూల్డ్ కాస్ట్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో తెలంగాణ మున్సిపల్ స్వీపర్ కామాటి వెల్ఫేర్ ప్రెసిడెంట్. ముత్యాపాక సత్యనారాయణ, మరియు ఇందిరా, ఆనంద్,శరత్ పాల్గొన్నారు.

## మాధాపూర్‌లో రోడ్డు ప్రమాదం.. యువకుడు మృతి

మాధాపూర్, సెప్టెంబర్ 10 (వాయిస్ టుడే): రోడ్డు డివైడర్‌ను రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ ఢీకొన్న ఘటనలో 22 ఏళ్ల ప్రైవేట్ ఉద్యోగి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదం బుధవారం రాత్రి మాధాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సెప్టెంబర్ 9, 2026న రాత్రి సుమారు 9.20 గంటల సమయంలో కొండాపూర్‌లోని బిక్షపతినగర్‌లో ఉన్న ఎస్‌ఎస్ ప్రీమియం పీజీ నుంచి మెటల్ చార్మినార్ వైపు పోలవరపు తేజస్ (22), అతని స్నేహితుడు దట్టి మోహిత్ (20) రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ (AP 39 DD 1444)పై ప్రయాణిస్తున్నారు. మెటల్ చార్మినార్‌కు కొద్దిదూరం ముందు తేజస్ బైక్‌పై నియంత్రణ కోల్పోవడంతో రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో తేజస్ తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌పై వెనుక కూర్చున్న మోహిత్ స్వల్ప గాయాలకు గురికాగా, చికిత్స నిమిత్తం యశోద ఆసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని తొలుత కొండాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, అనంతరం తదుపరి ప్రక్రియల నిమిత్తం ఉస్మానియా జనరల్ ఆసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి పి. కనక రాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మాధాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



## మట్టి వినాయకులను పూజిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం: ఆరెకపూడి గాంధీ

శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 10(వాయిస్ టుడే): వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 6,500 మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేసే కార్యక్రమాన్ని పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ వివేకానందనగర్‌లోని తన నివాసంలో ప్రారంభించి ప్రతిమలను పంపిణీ చేశారు. హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. ప్రతి ఒక్కరూ మట్టి వినాయక ప్రతిమలను పూజించాలని, చెరువులు కలుషితం కాకుండా సంరక్షించుకోవాలని సూచించారు. మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు.

హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత 12 సంవత్సరాలుగా మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేయడం అభినందనీయమని గాంధీ అన్నారు. పర్యావరణ పరిరక్షణకు దోహదపడే మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్న హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్ కుమార్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్ కుమార్ మాట్లాడుతూ ఈ ఏడాది 6,500 మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రజలు మట్టి వినాయక ప్రతిమలను పూజించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యుడు బసిరెడ్డి మధుసూదన్ రెడ్డి, సింగదాసరి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## నిరసనను కెమెరాలో చూపించడం లేదని.. కెమెరాకే నేరుగా సందేశం ఇచ్చిన ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 10(వాయిస్ టుడే): శాసనమండలిలో తమ నిరసనను కెమెరాల్లో చూపించడం లేదని.. ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు వినూత్నంగా నిరసన తెలిపారు. ఎమ్మెల్సీ చింతపండు నవీన్ మాట్లాడుతున్న సమయంలో పక్కనే కూర్చొని, జేబులో నుంచి పేపర్ తీసి కెమెరాకు కనిపించేలా చూపిస్తూ బామ్మర్దికి అమృత్ టెండర్లు తమ్ముడికి రావిర్యాల భూములు రైజింగ్ అనుముల ఫ్యామిలీఅంటూ నిరసన వ్యక్తం చేశారు. నిరసన కెమెరాలో కనిపించగానే.. వెంటనే కెమెరాను అటువైపు నుంచి తిప్పేసిన మండలి సిబ్బంది కెమెరాలు తిప్పినా.. బీఆర్ఎస్ ప్రశ్నించే గొంతుకను మాత్రం ఆపలేరు!



## అభాగ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో మట్టి గణపతుల ఉచిత పంపిణీ

నాచారం (వాయిస్ టుడే): పర్యావరణ పరిరక్షణలో భాగంగా అభాగ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ డాక్టర్ లక్కరాజు నిర్మల 30 ఏళ్లుగా మట్టి గణపతులను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది 100 మట్టి గణపతులను ఉస్మానియా విశ్వవిద్యాలయం, ఓయూ పోలీస్‌స్టేషన్, తార్నాక ప్రాంతాల్లో పంపిణీ చేశారు. పర్యావరణాన్ని కాపాడితేనే భవిష్యత్ తరాలకు మేలు జరుగుతుందని నిర్మల తెలిపారు. కార్యక్రమంలో నరసింహారావు, లత, విద్య, రమ, సావిత్రి, సుధ, అబ్బవరపు రమ తదితరులు పాల్గొన్నారు.




## కుటుంబ బాధ్యతలతోనే పీహెచ్‌డీ సాధించిన దీపా బానోత్

నాచారం (వాయిస్ టుడే): ఈసీఐఎల్‌కు చెందిన ఉస్మానియా విశ్వవిద్యాలయం బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగ పరిశోధక విద్యార్థిని డా. దీపా బానోత్ పీహెచ్‌డీ పట్టా సాధించారు. ఇద్దరు పిల్లల తల్లిగా కుటుంబ బాధ్యతలు నిర్వర్తిస్తూనే పరిశోధన పూర్తి చేసి డాక్టరేట్ పొందడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. తెలంగాణలో ఎంపిక చేసిన ప్రభుత్వ, ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో ఉద్యోగుల సంతృప్తిపై తులనాత్మక అధ్యయనం అంశంపై ఆమె పరిశోధన చేశారు. ఉన్నత విద్యాసంస్థల్లో ఉద్యోగుల సంతృప్తి మెరుగుదలకు పలు సూచనలు ప్రతిపాదించారు. డా. వి. సమున్నత పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ శ్రీరాములు, డీన్ ప్రొఫెసర్ జహంగీర్, విభాగాధిపతి ప్రొఫెసర్ విద్యాసాగర్‌రావు, అధ్యాపకులు, పరిశోధకులు, సిబ్బంది ఆమెను అభినందించారు.

పెద్ద కుమారుడు ఎంబీబీఎస్, చిన్న కుమారుడు ఇంజినీరింగ్ చదువుతున్న సమయంలో కుటుంబ బాధ్యతలను చూసుకుంటూనే పీహెచ్‌డీ సాధించడం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని దీపా బానోత్ తెలిపారు. తన భర్త రవి తేజ, కుటుంబ సభ్యులు, పరిశోధన పర్యవేక్షకురాలు డా. వి. సమున్నత అందించిన ప్రోత్సాహానికి కృతజ్ఞతలు తెలిపారు. ఆమె విజయం కుటుంబ బాధ్యతలతో పాటు ఉన్నత విద్యను కొనసాగించాలనుకునే మహిళలకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.



## సీఎంర్ఫ్ ముఖ్య మంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ చేసిన డిసిసి ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్

కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 10(వాయిస్ టుడే ): కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని షాపూర్‌నగర్‌లో మేడ్చల్--మల్కాజ్‌గిరి డీసీసీ ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్ ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంర్ఫ్ ) ద్వారా మంజూరైన చెక్కులను బాధితులకు అందజేశారు. రమేష్, గాయత్రి, సత్తార్, సైదారత్న, హేమలత, సంగీత, ప్రకాష్, నవత, శంకర్ తదితరులకు మంజూరైన మొత్తం రూ.4,20,000 విలువైన చెక్కులను ఈరోజు షాపూర్‌నగర్‌లోని తన నివాసంలో బాధితులకు అందజేశారు.

ఈ సందర్భంగా కూన శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. నిరుపేదలు అనారోగ్యానికి గురై ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న సమయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. పేద కుటుంబాలకు వైద్య ఖర్చుల భారాన్ని తగ్గించడంలో సీఎంఆర్ఎఫ్ కీలకంగా నిలుస్తోందన్నారు, రాష్ట్ర ప్రభుత్వం ఈ నిధులకు సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు శ్రీధర్ బాబు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జిమ్మి దేవేందర్, బుచ్చిరెడ్డి, బాలప్ప, యంసాగర్, మోతే శ్రీనివాస్ యాదవ్, ఆంజనేయులు ముదిరాజ్, ఆర్వ వెంకట్ రమణ, శ్రీరాములు,సలీం, చందు గౌడ్, ప్రభాకర్ రెడ్డి, సలీం, శంకర్ గౌడ్, చోటు, రఘు, రాజి రెడ్డి, రామగిరి రాకేష్,రిజ్వాన్, నవాజ్ పాల్గొన్నారు.



## కొలన్ సులోచన మృతికి మల్లు రవి, హరివర్ధన్ రెడ్డి సంతాపం

కుత్బుల్లాపూర సెప్టెంబర్10 (వాయిస్ టుడే ): కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి మాతృమూర్తి, కీ.శే. కొలన్ సులోచన నిన్న అకాల మరణం చెందడంతో, గురువారం ఆయన నివాసానికి పలువురు ప్రముఖులు విచ్చేసి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ ఎంపీ డా. మల్లు రవి మరియు మేడ్చల్--మల్కాజ్‌గిరి మాజీ డీసీసీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి కొలన్ హన్మంత్ రెడ్డి పరామర్శించి, సులోచనమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. సులోచన మృతి పట్ల వారు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



## కొండాపూర్ వార్డు సమస్యలపై ఆరెకపూడి గాంధీ సమీక్ష

శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 10 (వాయిస్ టుడే): "వన్ డే.. వన్ వార్డు" కార్యక్రమంలో భాగంగా పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ కొండాపూర్ వార్డులోని పలు పౌర సమస్యలు, అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. గోల్డెన్ తులిప్ కాలనీ పార్కులో జరిగిన ఈ సమావేశంలో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) కమిషనర్ జి. శ్రీజన, జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ మాలెంపాటి, డిప్యూటీ కమిషనర్ సేవా ఇస్లావత్, మాజీ కార్పొరేటర్ హమీద్ పటేల్, సీఎంసీ అధికారులు, వివిధ కాలనీల రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆయా కాలనీల్లో నెలకొన్న రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, తాగునీరు, నాలాలు, పార్కులు తదితర సమస్యలను స్థానికులు ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, సీఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు ప్రస్తావించిన సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి, పెండింగ్‌లో ఉన్న పనులను, అసంపూర్తిగా ఉన్న అభివృద్ధి పనులను ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని గాంధీ అధికారులను ఆదేశించారు.

కొండాపూర్ వార్డులో రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, తాగునీటి సౌకర్యాలను మరింత మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటామని గాంధీ తెలిపారు. ప్రతి కాలనీలోని పార్కులను అభివృద్ధి చేసి మెరుగైన వసతులు కల్పించడంతో పాటు ఓపెన్ జిమ్‌లు, చిన్నారులు, వృద్ధులకు అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కొండాపూర్ వార్డులో పెండింగ్‌లో ఉన్న వివిధ అభివృద్ధి పనులపై సీఎంసీ కమిషనర్ జి. శ్రీజనతో గాంధీ చర్చించారు. సీసీ రోడ్లు, రోడ్ల మరమ్మతులు తదితర పనులకు నిధులను సకాలంలో మంజూరు చేయాలని కోరారు. జరుగుతున్న పనులను వేగవంతం చేసి, పరిపాలనా లేదా ఆర్థికపరమైన ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పెండింగ్‌లో ఉన్న నాలాల విస్తరణ పనులను త్వరగా పూర్తి చేసి, వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు చేపట్టాలని గాంధీ ఆదేశించారు. ప్రతి కాలనీలో పార్కుల అభివృద్ధి, సుందరీకరణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలకు ఆహ్లాదకరమైన, పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ నివాస ప్రాంతాల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకుని నీటి సంరక్షణను సామాజిక బాధ్యతగా భావించాలని గాంధీ పిలుపునిచ్చారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుద్ధ్య కార్మికులకు అందించాలని కోరారు. కాలనీల్లో పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలు, మట్టి కుప్పలను ఎప్పటికప్పుడు తొలగించాలని పారిశుద్ధ్య సిబ్బందిని ఆదేశించారు. కొండాపూర్ వార్డుతో పాటు శేరిలింగంపల్లి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు తన వంతు కృషి చేస్తానని ఆరెకపూడి గాంధీ తెలిపారు. కార్యక్రమంలో సీఎంసీ ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, వాటర్ బోర్డు శాఖల అధికారులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



## 20న శ్రీ విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం

### మహోత్సవ పోస్టర్ను ఆవిష్కరించిన బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి

నాచారం (వాయిస్ టుడే): శ్రీ విరాట్ విశ్వబ్రాహ్మణ సంఘం జవహర్ నగర్ జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 20న మాంకాళమ్మ దేవాలయం ఆవరణలో జరిగే శ్రీ విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవ పోస్టర్ ను బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి ఆవిష్కరించారు. గురువారం ఏజీ ఆఫీస్ ఎదురుగా బీసీ సంక్షేమ భవన్ కార్యాలయంలో యజ్ఞ సమితి అధ్యక్షులు మారోజు రమేష్ చారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గణేష్ చారి హాజరై మాట్లాడారు. సమాజంలో అన్ని జాతులకు అండగా నిలబడిన సమ సమాజ నిర్మాణకర్తలు విశ్వకర్మలు అని అన్నారు. భారతదేశంలో ఉన్న 140 కోట్ల మంది ప్రజల క్షేమ సంతోషం కోసం విశ్వబ్రాహ్మణులు విరాట్ విశ్వకర్మ మహోత్సవం గత 50 సంవత్సరాలు నుండి నిర్వహిస్తున్నారని తెలిపారు. గతంలో ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో నిర్వహించే మహోత్సవానికి గత ముఖ్యమంత్రులు జలగం వెంగళరావు, విజయభాస్కర్ రెడ్డి, చంద్రబాబు నాయుడు, గవర్నర్లు, కేంద్ర మంత్రులు హాజరయ్యారని తెలిపారు. జవహర్ నగర్ లో 20న జరిగే యజ్ఞ మహోత్సవానికి పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మచారి, యాదగిరి చారి, సత్యం చారి, రమేష్ చారి, సోమచారి, రామాచారి, రవీంద్ర చారి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## మహిళ చైతన్యానికి ప్రతీక చాకలి ఐలమ్మ

### ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

### పటాన్చెరులో చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి కార్యక్రమం

పటాన్ చెరు (వాయిస్ టుడే): గడీలపై గళమెత్తి, తెలంగాణ రాష్ట్రంలో భూ పోరాటానికి నాంది పలికి, మహిళా చైతన్యానికి ప్రతీకగా నిలిచిన చాకలి ఐలమ్మ జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. చాకలి ఐలమ్మ 41వ వర్ధంతి పురస్కరించుకొని.. పటాన్చెరు డివిజన్ పరిధిలోని రజక సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన 41వ వర్ధంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పాల్గొని చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటంలో కీలక భూమిక పోషించి మహిళా చైతన్యానికి స్ఫూర్తిగా నిలిచిన చాకలి ఐలమ్మ పేరును హైదరాబాదులోని మహిళా విశ్వవిద్యాలయానికి నామకరణం చేశారని గుర్తు చేశారు. వారి వారసులకు సైతం సముచిత గౌరవం కల్పించారని పేర్కొన్నారు. ఐలమ్మ జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పటాన్చెరు మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, రజక సంఘం అధ్యక్షుడు మహేష్, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ క్రీడాపోటీలలో రాణించిన గీతం విద్యార్థిని

### పికిల్ బాల్ ప్రపంచ కప్ 2026లో రెండు పతకాలు సాధించిన బీబీఏ తొలి ఏడాది విద్యార్థి ఆశ్రిత

పటాన్ చెరు (వాయిస్ టుడే): వియత్నాంలో ఇటీవల జరిగిన అంతర్జాతీయ పికిల్ బాల్ ప్రపంచ కప్ 2026 పోటీలలో, హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్, బీబీఏ తొలి ఏడాది విద్యార్థిని ఆశ్రిత రాజు దాట్ల రెండు పతకాలు సాధించి సంస్థకు గర్వకారణంగా నిలిచారు. 18 ఏళ్ల లోపు విభాగంలో పోటీపడిన ఆశ్రిత, అద్భుతమైన ప్రదర్శన కనబరిచి, బాలికల సింగిల్స్ లో రజత పతకాన్ని, డబుల్స్ లో కాంస్య పతకాన్ని గెలుచుకున్నారు. ఒక అంతర్జాతీయ క్రీడా పోటీలలో సింగిల్స్, డబుల్స్.. రెండింటిలోనూ పతకాలు సాధించడం ఒక గొప్ప ఘనత. ఇది ప్రపంచ వేదికపై రాణించాలనే ఆమె ప్రతిభ, క్రమశిక్షణ, పట్టుదల, సంకల్పానికి నిదర్శనం.

ఆశ్రిత సాధించిన ఈ విజయం ఆమె కఠోర శ్రమ, నిబద్ధత, పికిల్ బాల్ పట్ల ఉన్న అభిరుచికి నిదర్శనం. ఆమె విజయం, చదువుకు అతీతంగా రాణించడం, సర్వతోముఖాభివృద్ధికి దోహదపడే అవకాశాలను అందిపుచ్చుకోవడం ప్రాముఖ్యతను కూడా చాటి చెబుతోంది. ఒక అంతర్జాతీయ క్రీడా కార్యక్రమంలో గీతంకు ప్రాతినిధ్యం వహించడం ద్వారా, ఇతర రంగాలలో రాణించాలని ఆకాంక్షించే తోటి విద్యార్థులకు ఆమె స్ఫూర్తిగా నిలిచారు. గీతం నాయకత్వం, ఆశ్రిత సాధించిన ఈ అద్భుత విజయానికి అభినందించి, ఆమె అంకితభావం, క్రీడా స్ఫూర్తి,



శ్రేష్ఠత పట్ల నిబద్ధతను ప్రశంసించింది. ఆమె మరిన్ని విజయాలను సాధించి, మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ప్రోత్సహించారు. వియత్నాంలో తన అద్భుతమైన ప్రదర్శనతో, ఆశ్రిత వర్ధమాన యువ క్రీడాకారులకు ఒక గొప్ప ప్రమాణాన్ని నెలకొల్పింది. అంకితభావం, పట్టుదల, నిరంత కృషితో ఆశయాలను అంతర్జాతీయ వేదికపై విజయాలుగా మార్చుకోవచ్చని ఆమె ప్రస్థానం నిరూపిస్తోంది.

### గీతంలో ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం

హైదరాబాదులోని గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ కు చెందిన అప్లైడ్ సైకాలజీ విభాగం, మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించడం, ఆత్మహత్యల నివారణపై బహిరంగ చర్చలను ప్రోత్సహించడం లక్ష్యంగా పలు కార్యక్రమాలతో సెప్టెంబర్ 10న ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని పాటించింది. 'ఆత్మహత్యలపై కథనాన్ని మార్చడం', 'చర్చను ప్రారంభించండి' అనే ఇతివృత్తంతో, మానసిక ఆరోగ్యంపై నెలకొన్న మౌనాన్ని ఛేదించడం, అలాగే వ్యక్తులు సహాయం కోరడానికి సౌకర్యవంతంగా భావించే సహాయక వాతావరణాన్ని సృష్టించడం యొక్క ప్రాముఖ్యతను చాటి చెప్పారు. భావోద్వేగ శ్రేయస్సు, మానసిక ఆరోగ్య సవాళ్లు, మద్దతు, ఆశ, ఆత్మహత్యల నివారణ వంటి అంశాలను అన్వేషించే ప్రదర్శనలు, కళాకృతులు, ఇతర సృజనాత్మక వ్యక్తీకరణల ద్వారా విద్యార్థులు, అధ్యాపకులు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు. ఈ చొరవ గీతం సమాజాన్ని సంభాషణలు ప్రారంభించడానికి, కళంకాన్ని సవాలు చేయడానికి, భావోద్వేగ బాధలను అనుభవిస్తున్న వారి పట్ల సానుభూతి, అవగాహనను పెంపొందించడానికి ప్రోత్సహించింది. ఈ కార్యక్రమాల ద్వారా, అప్లైడ్ సైకాలజీ విభాగం ప్రాంగణం అంతటా మరింత అవగాహన కల్పించడానికి, శ్రద్ధ, అనుబంధం, మద్దతు సంస్కృతిని ప్రోత్సహించడానికి తన నిబద్ధతను పునరుద్ఘాటించింది.



## హబ్సిగూడ-2 క్యాంపస్‌లో ఘనంగా "మేరా భారత్ శ్రేష్ఠ భారత్" సాంస్కృతిక వేడుకలు

హైదరాబాద్: సెప్టెంబర్ 10;( వాయిస్ టూ డే): నారాయణగూడ జోన్ పరిధిలోని హబ్సిగూడ–2 శాఖలో స్మార్ట్ లివింగ్ ప్రోగ్రామ్ ఆధ్వర్యంలో నిర్వహించిన "మేరా భారత్ శ్రేష్ఠ భారత్" వేడుకలు జాతీయ సమైక్యత, సాంస్కృతిక వైభవంతో ఘనంగా జరిగాయి. భారతదేశపు విశిష్ట సాంస్కృతిక వైవిధ్యాన్ని చాటిచెబుతూ, విద్యార్థులలో భిన్నత్వంలో ఏకత్వాన్ని పెంపొందించే ఉద్దేశంతో పాఠశాల ప్రాంగణాన్ని ఒక చిన్నపాటి భారతదేశంలా తీర్చిదిద్దారు. ఇందులో భాగంగా చారిత్రక నమూనాలు, సంప్రదాయ వస్త్రధారణ, ప్రాంతీయ వంటకాలు మరియు ఉత్సాహభరితమైన జానపద నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో చార్మినార్, తాజ్ మహల్, కోణార్క్ సూర్య దేవాలయం వంటి ప్రసిద్ధ చారిత్రక కట్టడాల నమూనాలను స్వయంగా తయారుచేసి, వాటి నిర్మాణ శైలి మరియు చారిత్రక ప్రాముఖ్యతను అతిథులకు, ఉపాధ్యాయులకు మరియు తోటి విద్యార్థులకు చక్కగా వివరించారు. అలాగే దేశంలోని ఉత్తర, దక్షిణ, తూర్పు, పశ్చిమ రాష్ట్రాల సాంప్రదాయ దుస్తులను ధరించి, ఆయా ప్రాంతీయ భాషల్లో అతిథులకు స్వాగతం పలుకుతూ స్థానిక ఆచార వ్యవహారాలు, సంస్కృతిని ప్రతిబింబించారు. మరోవైపు విద్యార్థులు వివిధ రాష్ట్రాల సంప్రదాయ వంటకాలైన ఢోక్లా, పూరన్ పోలి, ఇడ్లీ–సాంబార్, రసగుల్లా వంటి ప్రత్యేక పదార్థాలతో స్టాళ్లను ఏర్పాటు చేసి, భారతీయ ఆహార సంస్కృతిని పరిచయం చేశారు. అనంతరం వేదికపై విద్యార్థులు ప్రదర్శించిన భాంగ్రా, గర్బా, లావణి, బిహు వంటి జానపద నృత్యాలు ఆహూతులను విశేషంగా ఆకట్టుకుని ప్రశంసలు పొందాయి. ఈ సందర్భంగా ఏజీఎం నూర్ మహమ్మద్ అలీ మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను, వారి ప్రదర్శనలను అభినందించారు. రీజినల్ ఇన్‌ఛార్జ్ వెంకటేష్ బండి మాట్లాడుతూ విద్యార్థులలో వెల్లివిరిసిన జాతీయ సమైక్యతా భావాన్ని కొనియాడారు. ప్రిన్సిపాల్ శ్రీ కీర్తి కోన మాట్లాడుతూ తమ విద్యార్థులు వివిధ రాష్ట్రాల సంస్కృతిని, సంప్రదాయ దుస్తులను మరియు నృత్య రూపాలను అద్భుతంగా ఆవిష్కరించారని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీన్ నాగరాజ్, ఐపీఎల్ ఇన్‌ఛార్జ్ వెంకటేష్ గుప్తా మరియు ఉపాధ్యాయ బృందం పాల్గొని, విద్యార్థులలో సృజనాత్మకతను మరియు సాంస్కృతిక స్ఫూర్తిని నింపిన ఈ కార్యక్రమాన్ని ప్రశంసించారు.



## పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 42వ వర్ధంతి

### శ్రీ బాలాజీ ఫౌండేషన్ చైర్మన్

పటాన్ చెరు (వాయిస్ టుడే): బిజెపి సంగారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యులు బలరాం మాట్లాడుతూ.కొంగు నడుముకు చుట్టి.. కొడవలి చేతపట్టి దొరల గడీల అహంకారాన్ని బద్దలు కొట్టిన వీరనారి చాకలి ఐలమ్మ. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం ప్రాణాలను పణంగా పెట్టి పోరాడిన ధైర్యశాలి. నా భూమి నాది. నా చెమటొడ్చి పండించుకున్న పంట నాది.. దొరలకు తలవంచేది లేదు!" ఈ కార్యక్రమంలో రజక సంఘం రామచంద్రపురం పట్టణ శాఖ నాయకులు చాకలి నరసింహ, ప్రభు, చాకలి లింగయ్య, శ్రీనివాస్, సాయి, అంజయ్య, బిక్షపతి కృష్ణ, సుధాకర్, కరిక కృష్ణ, తుకారం, అనిల్, సతీష్, ఈ కార్యక్రమంలో పాల్గొని ఘన నివాళులు అర్పించడం జరిగింది.

## చిట్కుల్ గ్రామంలో ఘనంగా వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి



పటాన్ చెరు (వాయిస్ టుడే): ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలో చిట్కుల్ గ్రామంలో వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి ఘనంగా నిర్వహించిన రజక సంఘం నాయకులు కార్యకర్తలు అనంతరం మాట్లాడుతూ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 42వ వర్ధంతి సందర్భంగా చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించిన రజక సంఘం నాయకులు కొంగు నడుముకు చుట్టి.. కొడవలి చేతపట్టి దొరల గడీల అహంకారాన్ని బద్దలు కొట్టిన వీరనారి చాకలి ఐలమ్మ. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం ప్రాణాలను పణంగా పెట్టి పోరాడిన ధైర్యశాలి. నా భూమి నాది. నా చెమటొడ్చి పండించుకున్న పంట నాది.. దొరలకు తలవంచేది లేదు!" ఈ కార్యక్రమంలో ఇస్నాపూర్ మున్సిపల్ సిబ్బంది చిట్కుల్ గ్రామ నాయకులు, మరియు,రజక సంఘశీ సభ్యులు పాల్గొని ఘన నివాళులు అర్పించారు.

## ఇస్నాపూర్ మున్సిపల్ చైర్మన్ మోటే సుమలత ఆధ్వర్యంలో కౌన్సిల్ సాధన సమావేశం




పటాన్ చెరు (వాయిస్ టుడే): ఇస్నాపూర్ మున్సిపాలిటీ ఈరోజు కౌన్సిల్ సాధారణ సమావేశం లక్డారం వార్డు కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ మోటే సుమలత, కమిషనర్ వెంకట కిషన్ అధ్యక్షతన నిర్వహించడం మున్సిపల్ కౌన్సిల్ సాధన సమావేశంలో బోనాల పండుగ ఉత్సవాలు మరియు వినాయక చవితి సందర్భంగా నిమర్జనానికి సంబంధించిన ఏర్పాట్లు వాటి యొక్క ఖర్చు నిధులను ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించి కౌన్సిలర్ల సమక్షంలో ఆమోదం తెలుపుతూ మరియు అలాగే రాబోవు బతుకమ్మ, దసరా పండుగ సందర్భంగా వాటి యొక్క నిర్వహించే కార్యక్రమం సంబంధించిన ఖర్చులు ఆమోదం తెలపడం మరియు పారిశుద్ధ్యం త్రాగునీటి వార్డు పారిశుభ్రత మరియు వీధి దీపాలు మున్సిపల్ పరిధిలో ఉన్న వార్డులలో సిసి రోడ్లు డ్రైనేజీ పలు కార్యక్రమాలపై మెరుగుపరచడానికి కావలసిన అంశాలు పై కౌన్సిలర్లు వివిధ అంశాలపై చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ చైర్మన్ మోటే సుమలత,కమిషనర్ వెంకట కిషన్, స్థానిక కౌన్సిలర్లు వివిధ శాఖల అధికారులు మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ ఎక్స్ ఖాతా ఆధారంగా అసెంబ్లీని తప్పుదోవ పట్టించిన సీఎం రేవంత్ రెడ్డి

### రూల్ 168 కింద సభా హక్కుల ఉల్లంఘన నోటీసు

హైదరాబాద్, (వాయిస్ టుడే): సెప్టెంబర్ 9, 2026న తెలంగాణ శాసనసభలో జరిగిన చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నకిలీ ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలోని పోస్టును ఆధారంగా చేసుకుని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత కె. చంద్రశేఖర్ రావు ప్రతిష్టకు భంగం కలిగించేలా నిరాధార ఆరోపణలు చేశారని, పవిత్రమైన శాసనసభను తప్పుదోవ పట్టించారని ఆరోపిస్తూ శాసనసభ నియమావళి రూల్ 168 కింద సభా హక్కుల ఉల్లంఘన నోటీసు అందజేశారు. ఈ మేరకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కలిసి అసెంబ్లీ సెక్రటరీ రెడ్ల తిరుపతి కి సభా హక్కుల ఉల్లంఘన నోటీసును అందజేశారు. చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'బీఆర్ఎస్ అంతర్జాతీయ కార్యదర్శి సంధ్యారావు' పేరిట ఉన్నట్లు పేర్కొన్న నకిలీ ఎక్స్ ఖాతాలోని పోస్టును శాసనసభలో చదివి వినిపించారని వారు తెలిపారు. బీఆర్ఎస్‌లో లేని 'అంతర్జాతీయ కార్యదర్శి' పదవిని సృష్టించి, ఆ పేరుతో రూపొందించిన నకిలీ సోషల్ మీడియా ఖాతాలోని సమాచారాన్ని ఆధారంగా చేసుకుని ముఖ్యమంత్రి స్వయంగా శాసనసభలో ప్రస్తావించడం తీవ్రంగా పరిగణించాల్సిన అంశమని పేర్కొన్నారు. పవిత్రమైన చట్టసభలో అవాస్తవ, నిరాధార మరియు వాస్తవ విరుద్ధమైన సమాచారాన్ని ప్రదర్శించడం ద్వారా సభా గౌరవానికి భంగం కలిగించడంతో పాటు, సభ్యులను తప్పుదోవ పట్టించే పరిస్థితి ఏర్పడిందని వారు ఆరోపించారు. అందువల్ల నకిలీ ఎక్స్ ఖాతాలోని సమాచారాన్ని ఆధారంగా చేసుకుని శాసనసభలో వాస్తవ విరుద్ధమైన ప్రకటనలు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై రూల్ 168 కింద సభా హక్కుల ఉల్లంఘన నోటీసును అందజేశామని తెలిపారు. ఈ అంశాన్ని తక్షణమే పరిశీలించి, నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని అసెంబ్లీ సెక్రటరీని వారు కోరారు.

# రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు



సికింద్రాబాద్, సెప్టెంబరు10: రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ జన్మదినాన్ని పురస్కరించుకుని పలువురు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలు ఆయనను కలిసి ఘనంగా శుభాకాంక్షలు తెలియజేశారు. సికింద్రాబాద్ బి-బ్లాక్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు జగదీశ్వర్ రావు ఆధ్వర్యంలో నాయకులు ఎంపీ అనిల్ కుమార్ యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు అందజేశారు. ప్రజాసేవలో ఆయన నిరంతరం ముందుంటూ, భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు అధిష్ఠించి, నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఈ సందర్భంగా నాయకులు ఆకాంక్షించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ నిరంతరం కృషి చేస్తూ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్నారని నేతలు కొనియాడారు.

ఈ కార్యక్రమంలో చిలకలగూడ డివిజన్ అధ్యక్షులు జహంగీర్, ముఖ్య నాయకులు శంకర్, ఖాజా, వినయ్ (సోనూ) తదితరులు పాల్గొని ఎంపీకి శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా తమకు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.



## మూసి కాలుష్య నివారణకే ప్రాధాన్యం ఇవ్వాలి

**మూసి జన ఆందోళన్..**

**ఇళ్లు కూల్చడం కాదు, నదిని పరిరక్షించడమే నిజమైన అభివృద్ధి..**

సికింద్రాబాద్, సెప్టెంబర్ 10 (వాయిస్ టుడే ప్రతినిధి): మూసి నది అభివృద్ధి పేరుతో చేపడుతున్న చర్యల్లో ప్రజల జీవన హక్కులు, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని మూసి జన ఆందోళన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద గల ధర్నా చౌక్ లో మూసి ప్రాజెక్టు నిర్వాసితులతో నిర్వహించిన సమావేశంలో పలువురు ప్రజాప్రతినిధులు, పర్యావరణవేత్తలు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే, గత ప్రభుత్వంలో మూసి ప్రాజెక్టు చైర్మన్‌గా పనిచేసిన సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, గత ప్రభుత్వం మూసి నదిని శుభ్రపరిచే దిశగా చర్యలు చేపట్టగా, ప్రస్తుత ప్రభుత్వం మూసి పరివాహక ప్రాంతాన్ని రియల్ ఎస్టేట్ అభివృద్ధికి వినియోగించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు.

విశ్రాంత శాస్త్రవేత్త, పర్యావరణవేత్త బాబూరావు మాట్లాడుతూ, సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) లేకుండానే కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ అనుమతులు ఇవ్వడం ఆశ్చర్యకరమని పేర్కొన్నారు. పర్యావరణవేత్త దొంతి నరసింహారెడ్డి మాట్లాడుతూ, ప్రాజెక్టులో నది కాలుష్య నివారణ అంశాలకు తగిన ప్రాధాన్యం లేకపోవడాన్ని ప్రశ్నిస్తూ, మూసి అభివృద్ధి విషయంలో అన్ని ప్రభుత్వాలు విధ్వంసకర విధానాలను అనుసరిస్తున్నాయని విమర్శించారు. ఈ సందర్భంగా మూసి జన ఆందోళన్ ఐదు ప్రధాన డిమాండ్లను వెల్లడించింది. సమగ్ర డీపీఆర్‌ను తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్ భాషల్లో విడుదల చేసి ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాలని, స్వతంత్ర పర్యావరణ, సామాజిక ప్రభావ అంచనాలు పూర్తయ్యే వరకు భారీ నిర్మాణాలను నిలిపివేయాలని కోరింది. అలాగే పరిశ్రమల వ్యర్థాలు నదిలో కలవకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, మురుగునీటి శుద్ధి కేంద్రాలను పూర్తి సామర్థ్యంతో నిర్వహించాలని సూచించింది. వికారాబాద్ నుంచి వాడపల్లి వరకు మొత్తం మూసి పరీవాహక ప్రాంతాన్ని పర్యవేక్షించే ప్రత్యేక 'మూసి రివర్ బేసిన్ అథారిటీ'ని ఏర్పాటు చేయాలని, 1997 నుంచి మూసి పునరుద్ధరణ పేరుతో ఖర్చు చేసిన ప్రజాధనంపై పారదర్శక ప్రజా ఆడిట్ నిర్వహించాలని డిమాండ్ చేసింది.



## స్పీకర్‌తో ఉద్యోగ సంఘాల నేతల భేటీ

**దసరాలోపు పీఆర్సీ ప్రకటించాలని విజ్ఞప్తి**

సికింద్రాబాద్, సెప్టెంబర్ 10 (వాయిస్ టుడే ప్రతినిధి): అసెంబ్లీలోని స్పీకర్ చాంబర్‌లో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తో ఉద్యోగుల సంఘాల నేతలు భేటీ అయ్యారు. ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ ఆధ్వర్యంలో స్పీకర్ తో భేటీ అయ్యి పీఆర్సీ, డీఏలతో పాటు పలు సమస్యలపై చర్చించారు. ఈ ఏడాది దసరా లోపు పీఆర్సీ ప్రకటించాలని ఉద్యోగ సంఘాల నేతలు స్పీకర్ కు విజ్ఞప్తి చేశారు. మూడు డీఏలు ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే ప్రకటించాలని, సీపీఎస్ విధానం రద్దు పరచడానికి కమిటీ వేయాలని, 01-09-2004 కన్నా ముందు నోటిఫికేషన్ విడుదలై తదుపరి నియామకం పొందిన వారికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాదిరిగా పాత పెన్షన్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. పెండింగ్ బిల్లులు నెలకు రెండు వేల కోట్లు చెల్లించాలని రిక్వెస్ట్ చేశారు. ఈహెచ్ఎస్ స్ట్రీమ్ లైన్ చేయాలని కోరారు. ఉద్యోగ సంఘాల డిమాండ్లపై స్పీకర్ ప్రసాద్ కుమార్ సానుకూలంగా స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని స్పీకర్ ప్రసాద్ కుమార్ హామీ ఇచ్చారు. స్పీకర్ ప్రసాద్ కుమార్ తో భేటీ అయిన వారిలో ఉద్యోగుల జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరు శ్రీనివాస రావు, అడిషనల్ సెక్రటరీ జనరల్ దామోదర్ రెడ్డి, జేఏసీ డిప్యూటీ సెక్రటరీ జనరల్ డాక్టర్ ముజీబ్, కో-చైర్మన్లు సదానంద గౌడ్, బిక్షపతి గౌడ్, శ్యామ్, జేఏసీ సెక్రటరీ వెంకట్ ఉన్నారు.

## స్కిల్లింగ్ లేదా నైపుణ్యాలు పెంపొందించే దిశగా లిటరసీ హౌస్



సికింద్రాబాద్ సెప్టెంబర్ 10 (వాయిస్ టుడే ప్రతినిధి): ఆంధ్రమహిళాసభ మరో మైలురాయిని అధిగమించింది. విద్యార్థులకి ఉపాధి అవకాశాలు అందించేలా నేషనల్ స్కిల్ ఫ్రేమ్ వర్క్ లో పొందుపరిచిన క్వాలిఫికేషన్ ప్యాక్ లని అందిస్తోంది. ఈ కార్యక్రమాలలో భాగంగానే పలు కోర్సులలో శిక్షణను పూర్తి చేసిన ఆంధ్రమహిళా సభ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థులకు సర్టిఫికెట్ల ప్రధాన కార్యక్రమాన్ని నిర్వహించారు. 473 మంది విద్యార్థులు ఉచితంగా ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ (ూ× ) , సైబర్ సెక్యూరిటీ అంశాలలో యునిసెఫ్, ఐబిఎమ్ (×దీవీ) వారి సర్టిఫికెట్ లను అందుకున్నారు. ఇవేకాక , ట్యాలీ, గ్రాఫిక్ డిజైనింగ్, హాస్పిటల్ ఇన్ఫర్మేషన్ మేనేజిమెంట్ సిస్టం (ఎ×మీా) తదితర అంశాలలో పూర్తి శిక్షణ పొంది సర్టిఫికెట్లను అందుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విశ్రాంత ఐఏఎస్ డి.చక్రపాణి హాజరై మాట్లాడారు... నేటి సమాజంలో ఉద్యోగాలు పొందాలంటే, స్కిల్ సెట్ (నైపుణ్యాల శిక్షణ) నేర్చుకోవడం చాలా అవసరమని, రేపటి భవిష్యత్ కు ఇప్పుడు నేర్చుకొనే నైపుణ్యాలు బంగారు దారులు వేస్తాయని పేర్కొన్నారు. విశేషించి మహిళలు డిజిటల్ విద్యలు నేర్చుకొని మరింతగా పురోగమించాలని అభిలషించారు ఈ కార్యక్రమంలో ఆంధ్రమహిళా సభ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఇంఛార్జి పిన్సిపల్ డాక్టర్ కరుణ కుమారి, లిటరసీ హౌస్ ఛైర్పర్సన్ జె . రమాదేవి, సెక్రెటరీ ధరణి కందా పాల్గొన్నారు. రమాదేవి మాట్లాడుతూ మరిన్ని నైపుణ్యాల శిక్షణా కార్యక్రమాలను, ప్రత్యేకించి ఇరవయ్యోకటవ శతాబ్దపు తప్పనిసరి డిజిటల్ నైపుణ్యం ఏఐ టూల్స్ శిక్షణను మహిళలకు ఉచితంగా అందించడమే కాకుండా ఉపాధి అవకాశాలను అందిస్తున్నట్టు తెలిపారు.



## సంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జిగా జిట్టా రమ్యకృష్ణ

కూకట్‌పల్లి: సెప్టెంబర్ 10(వాయిస్ టుడే) సంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జిగా రాష్ట్ర యూత్ కాంగ్రెస్ సెక్రటరీ జిట్టా రమ్యకృష్ణ సునీల్ యాదవ్ నియమితులైన సందర్భంగా కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం హేమదుర్గ భవన్‌లో ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిట్టా రమ్యకృష్ణ సునీల్ యాదవ్, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం బండి రమేష్ రమ్యకృష్ణను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన జిట్టా రమ్యకృష్ణకు సంగారెడ్డి జిల్లా యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించడం సంతోషకరమన్నారు. యూత్ కాంగ్రెస్ బలోపేతానికి రమ్యకృష్ణ చేస్తున్న కృషిని అభినందిస్తూ, కొత్త బాధ్యతల్లో విజయవంతంగా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గ సీనియర్ నాయకులు జిట్టా సునీల్ కుమార్ యాదవ్, బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ సభ్యులు అస్లాం, మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సుశీల్ యాదవ్, కూకట్‌పల్లి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ నాయకులు బుజ్జి, యశ్వంత్, భాను, సంతు, యోగి తదితరులు పాల్గొన్నారు.



## 420 హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

**ఆర్‌వీ మహేందర్ కుమార్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ధర్నా**

హైదరాబాద్, సెప్టెంబర్ 10(వాయిస్ టుడే): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన 420 హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ గోషామహల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి ఆర్‌వీ మహేందర్ కుమార్ ఆధ్వర్యంలో ఎల్‌బీ స్టేడియం వద్ద ధర్నా నిర్వహించారు. ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేసి ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు శాంతియుతంగా నిరసన చేపట్టారు. ధర్నాలో ఆర్‌వీ మహేందర్ కుమార్తో పాటు బీఆర్ఎస్ నాయకులు మీశాల క్రాంతి, సునీల్ సింగ్, రహీమ్, విక్కీ తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలులో నిర్లక్ష్యం వహిస్తోందని వారు ఆరోపించారు. నిరసన సందర్భంగా పోలీసులు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, ప్రజల హక్కుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పోరాటం నిరంతరం కొనసాగుతుందని ఆర్‌వీ మహేందర్ కుమార్ స్పష్టం చేశారు.



## ఓయూలో 3 రోజుల 15వ జాతీయ సదస్సు ప్రారంభం

**వర్సిటీల్లో మౌలిక వసతుల ఆధునీకరణకు ప్రాధాన్యం ఇవ్వాలి**

**ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య వి. బాలకిష్టారెడ్డి**

సికింద్రాబాద్, అక్టోబర్ 10 (వాయిస్ టుడే ప్రతినిధి): విశ్వవిద్యాలయాల్లో మౌలిక వసతులను ఆధునీకరించడంతో పాటు విద్యా ప్రమాణాలను పెంపొందించేందుకు, ఉన్నత విద్యా సంస్కరణలను సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య వి. బాలకిష్టారెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో అఖిల భారత విశ్వవిద్యాలయ ఉద్యోగుల సమాఖ్య (ఐయూఈసీ) ఆధ్వర్యంలో 'ఉన్నత విద్య--ప్రస్తుత స్థితిగతులు' అంశంపై 15వ జాతీయ సదస్సు గురువారం ఠాగూర్ ఆడిటోరియంలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా బాలకిష్టారెడ్డి మాట్లాడుతూ ఉన్నత విద్యా రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. దేశ అభివృద్ధిలో విశ్వవిద్యాలయాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. ఓయూ వీసీ మాట్లాడుతూ దేశ నిర్మాణంలో విశ్వవిద్యాలయాల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. విశ్వవిద్యాలయాల అభివృద్ధిలో బోధనేతర సిబ్బంది, ఉద్యోగ సంఘాల సేవలు ప్రశంసనీయమన్నారు. టీజీసీహెచ్ఈ కార్యదర్శి శ్రీరామ్ వెంకటేష్, ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్సెస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాశీం తదితరులు ప్రసంగించారు. సదస్సులో అకాడమిక్ ఆడిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్. కిషన్, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, డీన్లు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. మూడు రోజులపాటు జరిగే సదస్సుకు వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 400 మంది ప్రతినిధులతో పాటు వెయ్యి మందికి పైగా హాజరవుతున్నారు. విద్యా విధానాలు, పాలనా సంస్కరణలు, పరిశోధన, సిబ్బంది సంక్షేమం తదితర అంశాలపై సదస్సులో చర్చలు జరగనున్నాయి.

## భర్త రైలు కింద, భార్య పురుగుల మందుతో...

**పెళ్లయిన 15 నెలలకే..కలహాల కాపురం విషాదంతం**



సికింద్రాబాద్, సెప్టెంబర్ 10 (వాయిస్ టుడే ప్రతినిధి): కుటుంబ కలహాలు ఓ దంపతుల నిండు జీవితాలను బలితీసుకున్నాయి. తరచూ జరుగుతున్న గొడవలతో మనస్తాపానికి గురైన భర్త రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడగా, అతని మృతివార్త తెలుసుకున్న భార్య ఇంట్లో పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడింది. పెళ్లయిన కేవలం 15 నెలలకే దంపతుల జీవితాలు విషాదాంతం కావడంతో రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. ఈ ఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తార్నాక విజయపురి కాలనీలో చోటుచేసుకుంది. పోలీసులు, జీఆర్‌పీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటకలోని కలబురగి జిల్లా అఫ్జల్‌పూర్‌కు చెందిన ధర్మన్న మంగ కొన్నేళ్ల క్రితం కుటుంబంతో హైదరాబాద్‌కు వచ్చి తార్నాక విజయపురి కాలనీలో నివాసం ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఆయన కుమారుడు శరణప్ప (28)కు 15 నెలల క్రితం అదే ప్రాంతానికి చెందిన లక్ష్మి (24)తో వివాహమైంది. పెళ్లి అనంతరం శరణప్ప, లక్ష్మి విజయపురిలోని తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్నారు. శరణప్ప నాచారంలోని పోటీ పాయింట్‌లో పనిచేస్తుండగా, లక్ష్మి ఇంటి వద్దే ఉంటోంది. వివాహం జరిగినప్పటి నుంచి భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నట్లు బంధువులు తెలిపారు. ఇటీవల రాఖీ పండుగ సందర్భంగా కర్ణాటకకు వెళ్లిన దంపతులు పది రోజుల క్రితం తిరిగి హైదరాబాద్‌కు వచ్చారు. అప్పటి నుంచి మళ్లీ వారి మధ్య విభేదాలు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన శరణప్ప గురువారం ఉదయం తన తండ్రితో కలిసి బయటకు వచ్చి టీ తాగాడు. అనంతరం 'మళ్లీ వస్తాను' అని చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. కొద్దిసేపటి తర్వాత ఎస్సీ--మౌలాలి అప్‌లైన్‌లోని కిలోమీటర్ నంబర్ 197/39-4 వద్ద గుర్తుతెలియని రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయాన్ని రైల్వే పోలీసులు శరణప్ప కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. భర్త రైలు కింద పడి మృతి చెందిన విషయం తెలుసుకున్న లక్ష్మి తీవ్ర మనస్తాపానికి గురై ఇంట్లో పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు గుర్తించి ఆస్పత్రికి తరలించేలోపే ఆమె మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న లాలాగూడ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని లక్ష్మి మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. శరణప్ప మృతిపై జీఆర్‌పీ పోలీసులు, లక్ష్మి ఆత్మహత్యపై లాలాగూడ పోలీసులు వేర్వేరుగా కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులతో సమన్వయం

**సమస్యల పరిష్కారానికి సామలహేమ నిరంతర కృషి**

సికింద్రాబాద్ సెప్టెంబర్ 10 (వాయిస్ టుడే ప్రతినిధి): సీతాఫల్మండి డివిజన్, పార్సీగుట్ట ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను మాజీ కార్పొరేటర్ డా. సామల హేమ పరిశీలించి, పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు. సీతాఫల్మండి డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయడంతో పాటు దెబ్బతిన్న రోడ్లు, గుంతలకు తక్షణ మరమ్మతులు చేపట్టాలని జిహెచ్ఎంసి స్పెషల్ ఆఫీసర్ జయేష్ రంజన్‌కు వినతిపత్రం అందజేశారు. వినాయక చవితి ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని అత్యవసర రోడ్డు మరమ్మతులకు ప్రత్యేక సిబ్బంది, వాహనాలు, మెటీరియల్ ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే ఖజణ పరిధిలోని స్వయం సహాయక సంఘాల మహిళలపై ఎలాంటి ఒత్తిడి లేకుండా చూడాలని, వారి సభ్యత్వం, రుణాలు, ఆర్థిక ప్రయోజనాలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సీతాఫల్మండి జూనియర్, డిగ్రీ కాలేజీల విద్యార్థులకు తాత్కాలిక తరగతి గదులు, మౌలిక వసతులు కల్పించాలని కోరారు. మరోవైపు పార్సీగుట్టలోని వీ='ం రెసిడెన్సీని సందర్శించిన ఆమె, స్థానికుల ఫిర్యాదు మేరకు డ్రైజర్ వాటర్, వీధి దీపాలు, చెట్ల కొమ్మల సమస్యలను పరిశీలించారు. గణేష్ ఆగమనాలకు అడ్డుగా ఉన్న ప్రమాదకర చెట్ల కొమ్మలను తొలగించడంతో పాటు నీరు, వీధి దీపాల సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను కోరారు. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని డా. సామల హేమ తెలిపారు.

వాయిస్ ఆఫ్ ప్రజలు

హైదరాబాద్
శుక్రవారం 11 సెప్టెంబరు 2026

# బీఆర్ఎస్ అరాచక, అప్రజాస్వామిక రాజకీయాలను ప్రజలు తిప్పికొట్టాలి

## సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు మిద్దెల జితేందర్

హైదరాబాద్, సెప్టెంబర్ 11: (వాయిస్ టుడే): తెలంగాణలో గత మూడు రోజులుగా బీఆర్ఎస్ నాయకులు వ్యవహరిస్తున్న తీరు పూర్తిగా అప్రజాస్వామికంగా ఉందని, రాజకీయ ప్రయోజనాల కోసం రాష్ట్రంలో ఉద్రిక్తతలు సృష్టించే ప్రయత్నం చేస్తున్నారని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు మిద్దెల జితేందర్ విమర్శించారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం అసెంబ్లీలో ప్రజా సమస్యలు, రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమంపై చర్చించేందుకు సిద్ధంగా ఉంటే.. బీఆర్ఎస్ నాయకులు ఉద్దేశపూర్వకంగా సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగిస్తూ ఘర్షణ వాతావరణాన్ని సృష్టించడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమన్నారు.

### అసెంబ్లీ గౌరవానికి భంగం

శాసనసభ నిబంధనలను పాటించకుండా నిరసనలకు దిగడం, సభా కార్యకలాపాలను అడ్డుకోవడం, స్పీకర్‌పై అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య వ్యవస్థకు గౌరవం ఇవ్వకపోవడమేనని అన్నారు. ప్రజల సమస్యలపై చర్చించాల్సిన పవిత్రమైన అసెంబ్లీని రాజకీయ రాద్ధాంతానికి వేదికగా మార్చడం సరికాదన్నారు.

### మహిళా పోలీసుల పట్ల అనుచిత ప్రవర్తన ఖండనీయం

అసెంబ్లీ ప్రాంగణంలో విధులు నిర్వహిస్తున్న మహిళా పోలీసుల పట్ల అనుచితంగా, దురుసుగా వ్యవహరించినట్లు




తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు మిద్దెల జితేందర్

వస్తున్న ఘటనలు ఆందోళనకరమని జితేందర్ అన్నారు. విధుల్లో ఉన్న పోలీసులను ప్రజా ప్రతినిధులు గౌరవించడం ప్రజాస్వామ్య బాధ్యత అని, మహిళల పట్ల గౌరవం ప్రతి ఒక్కరూ పాటించాల్సిన కనీస సంస్కారం అని స్పష్టం చేశారు.

ముఖ్యమంత్రిపై వ్యక్తిగత విమర్శలు రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యక్తిగతంగా, అభ్యంతరకర భాషలో విమర్శలు చేయడం రాజకీయ సంస్కృతికి విరుద్ధమని మిద్దెల జితేందర్ అన్నారు. విధానాలపై విమర్శలు చేయడం ప్రజాస్వామ్యంలో సహజమే అయినప్పటికీ.. వ్యక్తిగత దూషణలకు దిగడం సమర్థనీయం కాదన్నారు.

తెలంగాణ ప్రజలు అభివృద్ధి, సంక్షేమం, ఉద్యోగాలు, విద్య, వైద్యం, రైతుల సమస్యల పరిష్కారాన్ని కోరుకుంటున్నారని.. రాజకీయ రాద్ధాంతాన్ని కాదని అన్నారు. ప్రజా సమస్యలపై అసెంబ్లీలో నిర్మాణాత్మక చర్చ జరగాల్సిన సమయంలో బీఆర్ఎస్ అనుసరిస్తున్న తీరును ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. ప్రజాస్వామ్య సంస్థల గౌరవాన్ని కాపాడటం, అసెంబ్లీ ప్రతిష్ఠను పరిరక్షించడం, మహిళల గౌరవాన్ని కాపాడటం ప్రతి రాజకీయ పార్టీ బాధ్యత అని పేర్కొన్నారు.

### రాష్ట్రవ్యాప్తంగా ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసనలు

బీఆర్ఎస్ అనుసరిస్తున్న అప్రజాస్వామిక వైఖరిని ప్రజలకు వివరించేందుకు శుక్రవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా మండల స్థాయిలో ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని కాంగ్రెస్ సేవాదళ్ శ్రేణులకు మిద్దెల జితేందర్ పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ రాజకీయ అరాచకాన్ని ప్రజలకు వివరించడంతో పాటు ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ స్ఫూర్తి, మహిళల గౌరవాన్ని కాపాడేందుకు కాంగ్రెస్ సేవాదళ్ ఎల్లప్పుడూ ముందుంటుందని ఆయన స్పష్టం చేశారు.

## తెలంగాణ సాధన ఉద్యమంలో క్రిస్టియన్ జేఏసీ పాత్ర కీలకం

### నకిలీ జేఏసీల పట్ల అప్రమత్తంగా ఉండాలి
### చైర్మన్ జిలుకర రవికుమార్ స్పష్టం



హైదరాబాద్, సెప్టెంబర్ 10: ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో క్రైస్తవుల పక్షాన నిలిచి పోరాడిన ఏకైక సంస్థ 'తెలంగాణ క్రిస్టియన్ జేఏసీ' మాత్రమేనని ఆ సంస్థ రాష్ట్ర చైర్మన్ జిలుకర రవికుమార్ స్పష్టం చేశారు. స్వరాష్ట్ర సాధన పోరాటంలో అప్పటి ప్రధాన జేఏసీ నేతలు ప్రొఫెసర్ కోదండరాం, శ్రీనివాస్ గౌడ్, దేవి వరప్రసాద్, అద్దంకి దయాకర్, మల్లెపల్లి లక్ష్మయ్య, స్వామి గౌడ్ తదితరులతో కలిసి క్రిస్టియన్ జేఏసీ చురుకైన పాత్ర పోషించిందని ఆయన గుర్తు చేశారు. ఉమ్మడి పది జిల్లాల్లో అనేక బహిరంగ సభలు, రాస్తారోకోలు, ధూంధాం వంటి ఉద్యమ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించి, రాష్ట్ర ఆవిర్భావం వరకు నిరంతరం పోరాడామని తెలిపారు. అయితే, ఉద్యమ చరిత్ర లేని కొందరు వ్యక్తులు ప్రస్తుతం కొత్తగా 'తెలంగాణ జేఏసీ' పేరిట తెరపైకి వస్తున్నారని, సమాజం వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. నాటి ఉద్యమంలో క్రిస్టియన్ల తరఫున నిలిచింది తమ సంస్థ ఒక్కటేనని స్పష్టం చేశారు. ఈ ఉద్యమంలో క్రిస్టియన్ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ దాసరి శ్యామ్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేకల సారయ్య, చిలుకూరి రత్నరాజ్, ఖమ్మం ప్రసాద్, స్టీఫెన్, లుదియా పద్మతో పాటు కరీంనగర్ జిల్లా చైర్మన్ డి. జాన్, జాషువా, బి.ఎ. పాల్, ఉదయ్ కుమార్, సామ్యూల్ రాజ్, బాబన్న, జోసెఫ్ అబ్రహం, శైలేష్, జ్ఞానేందర్, రమేష్, ముప్పిడి వెంకటేష్, జి. భాను, విశాల్ కుమార్, సురేందర్, బాలరాజ్, నోవా, తదితరులు పాల్గొని ఉద్యమాన్ని ముందుండి నడిపించారని ఆయన పేర్కొన్నారు.



## భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి హిమాయత్‌నగర్ డివిజన్ కన్వీనర్‌గా గోపిశెట్టి ప్రమోద్

హైదరాబాద్, సెప్టెంబర్ 10: భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి హిమాయత్‌నగర్ డివిజన్ కన్వీనర్‌గా గోపిశెట్టి ప్రమోద్ నియమితులయ్యారు. రాబోయే వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం నిర్వహించిన సమావేశంలో ఉత్సవ సమితి సెంట్రల్ జిల్లా కార్యదర్శి ఆలె భాస్కర్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. గతంలో ఉత్సవాల నిర్వహణలో అందించిన విశేష సేవలను గుర్తించి, ప్రమోద్‌పై ఉన్న నమ్మకంతో మరోమారు ఈ బాధ్యతలను అప్పగించినట్లు సమితి నాయకులు తెలిపారు. తనపై నమ్మకంతో రెండోసారి కన్వీనర్‌గా బాధ్యతలు కల్పించినందుకు జిల్లా కార్యదర్శికి, ఉత్సవ సమితి పెద్దలకు ప్రమోద్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. హిమాయత్‌నగర్ డివిజన్ పరిధిలోని గణేష్ మండపాల నిర్వాహకులను, భక్తులను సమన్వయం చేసుకుంటూ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహిస్తానని ఆయన పేర్కొన్నారు. ప్రమోద్ నియామకం పట్ల పలువురు ఉత్సవ సమితి ప్రతినిధులు, కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## 2030 నాటి విద్యా భవిష్యత్తుపై చర్చకు వేదిక

### 'ఫ్యూచర్-రెడీ స్కూల్ లీడర్‌షిప్ సమ్మిట్'
### సెప్టెంబర్ 11న హెడ్‌వర్డ్ పబ్లిషింగ్ కంపెనీ ప్రతిష్ఠాత్మక సదస్సు

హైదరాబాద్, సెప్టెంబర్ 10: విద్యా రంగంలో నాయకత్వానికి, భవిష్యత్తు అవసరాలకు అనుగుణమైన మార్పులపై చర్చించేందుకు హెడ్‌వర్డ్ పబ్లిషింగ్ కంపెనీ (ఏబీపీ గ్రూప్) ఆధ్వర్యంలో 'ది ఫ్యూచర్-రెడీ స్కూల్ లీడర్‌షిప్ సమ్మిట్' శుక్రవారం (సెప్టెంబర్ 11) హైదరాబాద్‌లో జరగనుంది. అమీర్‌పేట్‌లోని సత్యం థియేటర్ రోడ్డులో గల ఆదిత్య పార్క్ హోటల్‌లో ఉదయం 9:30 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంట వరకు ఈ సదస్సు కొనసాగుతుంది. ఈ సదస్సులో భాగంగా "ది స్కూల్ ఆఫ్ 2030" అనే ప్రధానాంశంపై విద్యావేత్తలు, పాఠశాలల యాజమాన్యాలు, ప్రధానోపాధ్యాయులు, విధాన నిర్ణేతలతో ప్రత్యేక చర్చా గోష్ఠి (ప్యానెల్ డిస్కషన్) నిర్వహించనున్నారు. వేగంగా మారుతున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్), గ్లోబల్ నైపుణ్యాలకు అనుగుణంగా పాఠశాలల బోధనా విధానాన్ని తీర్చిదిద్దే మార్గాలపై నిపుణులు విశ్లేషించనున్నారు. ఈ సదస్సులో హెడ్‌వర్డ్ పబ్లిషింగ్ ప్రెసిడెంట్ మహేష్ శ్రీవాస్తవ, పల్లవి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ టి. తనుజ, సాధన ఇన్ఫినిటీ ఇంటర్నేషనల్ స్కూల్ అకడమిక్ హెడ్ శిరీష కొల్లి, గ్లెండేల్ అకాడమీ ఇంటర్నేషనల్ స్కూల్ హెడ్ డాక్టర్ త్రిలోక్ సింగ్ బిస్ట్, మెరిడియన్ స్కూల్ ప్రిన్సిపాల్ ఆక్రుష బెల్లనె, భాష్యం బ్లూమ్స్ అకడమిక్స్ డీన్ అర్చన ఠాకూర్, హెడ్‌వర్డ్ పబ్లిషింగ్ ప్రతినిధి శశి గుడిబండి తదితర ప్రముఖులు వక్తలుగా పాల్గొంటారు. ఈ సదస్సుకు హాజరుకాగోరే పాఠశాలల ప్రతినిధులు ముందస్తుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని, ఇతర పూర్తి వివరాల కోసం 9959836536 నంబరును సంప్రదించాలని నిర్వాహకులు ఒక ప్రకటనలో కోరారు.

## క్రీడల్లో కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



కాజీపేట, సెప్టెంబరు 10 (వాయిస్ టుడే): కాజీపేట డీజిల్ కాలనీలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు క్రీడా పోటీల్లో సత్తా చాటారు. ఫాతిమానగర్‌లోని ఫాతిమా ఎయిడెడ్ హైస్కూల్ గ్రౌండ్‌లో బుధవారం నిర్వహించిన 70వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మండలస్థాయి ఎంపికల్లో అండర్-17 విభాగంలో విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కబడ్డీ విభాగంలో ఎస్. లోకేష్, కోకో విభాగంలో ఎస్. అవినాష్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. హనుమకొండలో నిర్వహించనున్న జిల్లా స్థాయి కబడ్డీ, కోకో పోటీల్లో వీరు పాల్గొననున్నారు. జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ నుజహత్, వైస్ ప్రిన్సిపాల్ సాజిద్, పీఈటీ ఎన్. సురేష్, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.



## బోలుకొండ ప్రశాంత్‌కు ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్

### ఏఐ, లాంగ్వేజ్ డిటెక్షన్‌పై పరిశోధనకు గుర్తింపు

హనుమకొండ జిల్లా, సెప్టెంబర్ 10(వాయిస్ టుడే): నగరంలోని రామన్నపేటకు చెందిన బోలుకొండ ప్రశాంత్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్నారు. యూనివర్సిటీ 85వ స్నాతకోత్సవంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగంలో ఆయనకు డాక్టరేట్ పట్టాను వైస్‌చాన్స్‌లర్ సీనియర్ ప్రొఫెసర్ కుమార్ మొలుగారం చేతుల మీదుగా ప్రదానం చేశారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం ప్రొఫెసర్ పానుగంటి విజయపాల్ రెడ్డి పర్యవేక్షణలో "ఫైన్ ట్యూనింగ్ ఆఫ్ మోడల్స్ ఫర్ పెట్రొనైజింగ్ అండ్ కండెసెంటింగ్ లాంగ్వేజ్ డిటెక్షన్ అండ్ కేటగిరైజేషన్" అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించినందుకు ప్రశాంత్‌కు డాక్టరేట్ లభించింది. ఉస్మానియా యూనివర్సిటీ ఛాన్సలర్, రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల అధ్యక్షతన జరిగిన ఈ స్నాతకోత్సవానికి భారత్ బయోటెక్ చైర్‌పర్సన్ కృష్ణ ఎల్లా ముఖ్య అతిథిగా హాజరై డిగ్రీ గ్రహీతలను ఉద్దేశించి ప్రసంగించారు. డాక్టర్ బోలుకొండ ప్రశాంత్ ప్రస్తుతం సుమతి రెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఫర్ విమెన్‌లో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ విభాగాలకు విభాగాధిపతిగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన డాక్టరేట్ సాధించిన సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ. రాజశ్రీ రెడ్డి, మేనేజ్‌మెంట్ సభ్యులు, విభాగాధిపతులు, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.



## ఘనంగా ఎస్జీఎఫ్ జోనల్ స్థాయి క్రీడాపోటీల ముగింపు

తొర్రూరు, సెప్టెంబర్ 10 వాయిస్ టుడే : కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్ క్రీడల్లో నిర్వహించిన ఎస్జీఎఫ్ తొర్రూర్ జోనల్ లెవెల్ టోర్నమెంట్ అండ్ సెలక్షన్స్ ముగింపు కార్యక్రమంలో గుర్తూరు గ్రామ సర్పంచ్ వర్యులు శ్రీ విస్సంపల్లి కవిత బాలకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మూడు మండలాల నుంచి క్రీడల్లో పాల్గొన్న విద్యార్థిని, విద్యార్థులకు సర్పంచ్ శుభాకాంక్షలు తెలియజేశారు. క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి ఎదగడానికి ఎంతో దోహదపడతాయని అన్నారు. జోనల్ లెవెల్ క్రీడా పోటీలను మన గుర్తూరు మోడల్ స్కూల్‌లో నిర్వహించినందుకు మోడల్ స్కూల్ పీడీ, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల బృందానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించిన సర్పంచ్ గారు, క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విజేతలను అభినందిస్తూ వారికి మెడల్స్ అందజేశారు. క్రీడాకారులందరూ ఇదే స్ఫూర్తితో ముందుకు సాగి జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

## అణగారిన వర్గాల హక్కులకై పోరాడిన ధీరవనిత చాకలి ఐలమ్మ

### తొర్రూరులో చాకలి ఐలమ్మ విగ్రహం ఏర్పాటు చేయాలి



తొర్రూరు, సెప్టెంబర్ 10 వాయిస్ టుడే : నాడు భూమికోసం భుక్తి కోసం ఎట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన మహత్తర పోరాటంలో నైజాం కు వ్యతిరేకంగా పోరాడిన వీర వనిత చాకలి ఐలమ్మ అని సిపిఎం పార్టీ తోరూర్ మండల కార్యదర్శి ఎండి యాకూబ్ అన్నారు. నైజాం పరిపాలన ను గడగడలాడించిన నాడు జరిగిన తెలంగాణ రైతాంగ పోరాటంలో వీరనారి చాకలి ఐలమ్మ 41 వర్ధంతి తొర్రూరు సిపిఎం పార్టీ ఆఫీసులో ఘనంగా నిర్వహించారు. ఈ వర్ధంతి కి ముఖ్యఅతిథిగా తొర్రూర్ సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఎండి యాకూబ్ పాల్గొని ఐలమ్మ ఫోటోకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, తెలంగాణ సాయుధ పోరాటం స్ఫూర్తితో ఆరోజులలో విసునూరు రామచంద్రారెడ్డి దొరల గడీలు ఎర్రజెండాలు పాతి ఖబర్దార్ బిడ్డ రామచంద్రారెడ్డి అని ఐలమ్మ నాయకత్వంలో వేలాది ఎకరాల భూములను పంచినటువంటి వీరనారి చాకలి ఐలమ్మ అని వారు అన్నారు. ఐలమ్మ స్ఫూర్తిని తీసుకొని ఈనాటి యువత ఆదర్శంగా నిలవాలని వారు పిలుపునిచ్చారు ఈ వర్ధంతి సభకు హాజరైన సిపిఎం పార్టీ తోరూర్ మండల కమిటీ సభ్యులు జమ్మల శ్రీనివాస్, మార్క సాంబయ్య, దొనక దర్గయ్య, బోర స్వామి, కొత్త వెంకట్రెడ్డి, మట్టపల్లి కుమార్, సంతోష్ ,రామకృష్ణ, కొండ రాము, కొండ ఐలమల్లు, తిమ్మిడి రవి, ఎండి సెమినా, సౌజన్య, శోభ, రాధ, ఎండి మైపాషా తదితరులు పాల్గొన్నారు.



## రైతాంగ పోరాటంలో చాకలి ఐలమ్మది చెరగని ముద్ర

### - వెట్టి చాకిరి, విముక్తి కోసం పోరాడిన యోధురాలు
### - రజక వృత్తి దారుల సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ 41వ వర్ధంతి

తొర్రూరు, సెప్టెంబర్ 10 వాయిస్ టుడే : వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ 41వ వర్ధంతిని గురువారం మహబూబాబాద్ జిల్లా తోర్రూర్ పట్టణ కేంద్రంలోని ఆర్‌డబి గెస్ట్ హౌస్ లో రజక వృత్తి దారులు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పున్నం సారయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపాలిటీ చైర్మన్ తూనం శ్రావణ్ కుమార్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో చెరగని ముద్ర వేసిన గొప్ప మహిళా యోధురాలని అన్నారు. సామాజిక అన్యాయం, జమీందారీ వ్యవస్థ, దోపిడీకి వ్యతిరేకంగా ఆమె ధైర్యంగా పోరాడి అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు.ఉద్యమ నాయకురాలు వీరనారి చాకలి ఐలమ్మ పాలకుర్తి గడ్డ పై జన్మించడం గర్వకారణమన్నారు.ఈ కార్యక్రమంలో తోర్రూర్ రజక సంఘం మండలాధ్యక్షు నిమ్మల.సోమయ్య, కార్యదర్శి పొడగంటి శేఖర్ ,పట్టణ అధ్యక్షుడు చింతల. రాజు, కార్యదర్శి చింతల .మధు, నాయకురాలు ఓరుగంటి చైతన్య,నాయకులు ఓరుగంటి . ప్రవీణ్,మడిపెద్ది కార్తిక్,కొండ్రతి రామక్రిష్ణ,సైదులు,రాకున్నా, శ్రీకాంత్, శ్రీనివాస్,బిక్షం , రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాజీపేట రైల్వే పాలీక్లినిక్‌లో సిబ్బంది కొరతకు త్వరలో పరిష్కారం

**అత్యవసర రోగులకు హైదరాబాద్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులకు నేరుగా రెఫరల్**

**అదనపు సిబ్బంది నియామకాలకు చర్యలు**

**పీసీఎండీ డాక్టర్ నిర్మలా రాజారామ్**



కాజీపేట, సెప్టెంబరు 10 (వాయిస్ టుడే): కాజీపేట రైల్వే పాలీక్లినిక్‌లో సిబ్బంది కొరత, ఉద్యోగులు--రిటైర్డ్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఎదుర్కొంటున్న వైద్య సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని సౌత్ సెంట్రల్ రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ (గ్రాజవీణ) డాక్టర్ నిర్మలా రాజారామ్ హామీ ఇచ్చారు. పాలీక్లినిక్ సందర్శనకు వచ్చిన ఆమెను తెలంగాణ రైల్వే ఎంప్లాయిస్ జేఏసీ ప్రతినిధులు కలిసి వినతిపత్రం సమర్పించి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆమెను శాలువాతో సత్కరించారు. రైల్వే పాలీక్లినిక్‌లో వైద్యులు, నర్సులు, ఫార్మాసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ల్యాబ్ అసిస్టెంట్లు, వార్డ్‌బాయ్‌లు తదితర సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని జేఏసీ నాయకులు తెలిపారు. ఒక్కో వైద్యుడు రోజుకు 120--130 మంది వరకు ఓపీ రోగులను చూడాల్సి రావడంతో పనిభారం పెరుగుతోందని, రోగులకు తగిన సమయం కేటాయించలేకపోతున్నారని పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంటల మధ్య 450--500 మంది రోగులు వస్తుండగా, నర్సులు, ఫార్మాసిస్టుల సంఖ్య సరిపోక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. పాలీక్లినిక్‌కు అదనపు సిబ్బందిని మంజూరు చేయాలని కోరారు.

అత్యవసర పరిస్థితుల్లో కాజీపేట పాలీక్లినిక్ సీనియర్ ఎంఎస్ డాక్టర్ నిరంజన్‌కు హైదరాబాద్‌లోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులకు నేరుగా రెఫర్ చేసే అధికారం కల్పించాలని జేఏసీ కోరింది. దీనిపై స్పందించిన డాక్టర్ నిర్మలా రాజారామ్.. అత్యవసర రోగులను డాక్టర్ నిరంజన్ నేరుగా హైదరాబాద్‌లోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులకు రెఫర్ చేసేందుకు తక్షణమే అనుమతి ఇస్తున్నట్లు తెలిపారు. కాజీపేటతో పాటు లాలగూడ సెంట్రల్ ఆస్పత్రి, సౌత్ సెంట్రల్ రైల్వే పరిధిలోని పలు ఆస్పత్రుల్లో సిబ్బంది కొరత ఉన్న విషయాన్ని మూడు రోజుల క్రితమే రైల్వే బోర్డుకు తెలియజేశామని, త్వరలో నియామకాలు చేపట్టి అవసరమైన స్థాయిలో వైద్యులు, సిబ్బందిని నియమిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో తెలంగాణ రైల్వే ఎంప్లాయిస్ జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్, చైర్మన్ కొండ్ర నర్సింగా రావు, కో-కన్వీనర్లు ఏ. శ్రీనివాస్, వి. తిరుపతి, పి. రమేష్, ఎం. మహేష్, వస్కుల రవీందర్, వైస్ చైర్మన్లు డి. రవీందర్, జి. భాస్కర్, ఎం. రాజయ్య, ఎస్. రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలి

**విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్న జీవో 97ను తక్షణమే రద్దు చేయాలి**

**మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్**

**ఏకశిలా పార్క్‌లో డీఎస్ఏ నిరాహార దీక్షకు సంఘీభావం**

హనుమకొండ, సెప్టెంబరు 10 (వాయిస్ టుడే):లి పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, పాలిటెక్నిక్ విద్యార్థులను ఇబ్బందులు గురిచేస్తున్న జీవో నంబర్ 97ను తక్షణమే రద్దు చేయాలని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ డిమాండ్ చేశారు. డెమొక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ (డీఎస్ఏ) ఆధ్వర్యంలో ఏకశిలా పార్క్ వద్ద చేపట్టిన నిరాహార దీక్షకు ఆయన సంఘీభావం తెలిపారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్న ఆయన.. ప్రభుత్వం వారి న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు. వినయ్ భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడొద్దని అన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వేలాది మంది విద్యార్థులు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడి చదువుతున్నారని, నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. బకాయిలు పేరుకుపోవడంతో కళాశాలల యాజమాన్యాల నుంచి విద్యార్థులపై ఒత్తిడి పెరుగుతోందన్నారు. పాలిటెక్నిక్ విద్య సాంకేతిక విద్యలోకి అడుగుపెట్టేందుకు కీలకమైన మార్గమని, దానిని బలోపేతం చేయాల్సింది పోయి విద్యార్థులకు ఇబ్బందులు కలిగించే నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు.

జీవో 97ను రద్దు చేసి పాలిటెక్నిక్ విద్యార్థులకు న్యాయం చేయాలని, పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను తక్షణమే విడుదల చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కుల కోసం డీఎస్ఏ చేపడుతున్న ప్రజాస్వామ్య పోరాటాలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జోరిక రమేష్, విద్యార్థి నాయకుడు వీరస్వామి, బీసీ నాయకుడు తాడిచెట్టు క్రాంతి, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తి భావితరాలకు ఆదర్శం

**మాజీ కార్పొరేటర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు దాస్యం విజయ్ భాస్కర్**

**చాకలి ఐలమ్మ కు బీఆర్ఎస్ నేతల ఘన నివాళులు**

హనుమకొండ, సెప్టెంబరు 10 (వాయిస్ టుడే): తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో చాకలి ఐలమ్మ చూపిన ధైర్యసాహసాలు, ఆత్మగౌరవ పోరాటం భావితరాలకు ఆదర్శమని మాజీ కార్పొరేటర్ దాస్యం విజయ్ భాస్కర్ అన్నారు. ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కోఆర్డినేటర్ పులి రజనీకాంత్ ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విజయ్ భాస్కర్ మాట్లాడుతూ భూస్వామ్య దోపిడీ, వెట్టిచాకిరీ, సామాజిక వివక్షకు వ్యతిరేకంగా ఐలమ్మ సాగించిన పోరాటం తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిందన్నారు. పాలకుర్తిలో తన కష్టార్జిత పంటను కాపాడుకునేందుకు ఆమె చూపిన తెగువ వేలాది మంది రైతులు, పేదలు, కూలీలలో చైతన్యం నింపిందని పేర్కొన్నారు. అణచివేతకు వ్యతిరేకంగా హక్కుల కోసం ప్రజలు ఐక్యంగా నిలబడాలనే సందేశాన్ని ఐలమ్మ ఉద్యమం అందించిందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగేందుకు ఐలమ్మ జీవితం స్ఫూర్తిదాయకమని, యువత ఆమె పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని విజయ్ భాస్కర్ సూచించారు. సామాజిక న్యాయం, సమానత్వం, పేదల హక్కుల కోసం నిరంతరం కృషి చేయడమే ఐలమ్మకు అందించే నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో తాళ్లపల్లి జనార్దన్ గౌడ్, చాగంటి రమేష్, వడ్డేపల్లి రమేష్, మేకల బాపూరావు, సంపత్, రవీందర్‌రావు తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తెలంగాణ విమోచన చరిత్రను భావితరాలకు అందించాలి

**సెప్టెంబర్ 17ను అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవంగా నిర్వహించాలి**

**బీజేపీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్**



సిరిసిల్ల, సెప్టెంబర్ 10 (వాయిస్ టుడే): తెలంగాణ విమోచన చరిత్ర ను పరిరక్షించి, భావితరాలకు అందించా ల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందని బీజేపీ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్ అన్నారు. సెప్టెంబర్ 17 తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని బీజేపీ సిరిసిల్ల పట్టణ శాఖ ఆధ్వర్యం లో గురువారం సిరిసిల్ల మండల తహసీల్దార్ కార్యాలయం లో తహసీల్దార్ కు 'తెలంగాణ సత్తా సంకల్పాలు' అమలు చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భం గా దుమాల శ్రీకాంత్ మాట్లాడుతూ, నిజాం నిరంకుశ పాలన నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి లభించిన సెప్టెంబర్ 17కు చారిత్రక ప్రాధాన్యత ఉందన్నారు. విమోచన పోరాటం లో ఎందరో మహనీయులు, అమరవీరులు చేసిన త్యాగాలను నేటి, రాబోయే తరాలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. సెప్టెంబర్ 17 ను తెలంగాణ విమోచన దినోత్సవం గా అధికారికంగా ఘనంగా నిర్వహిం చాలని, విమోచన చరిత్ర ను పాఠ్యాంశాల్లో చేర్చి విద్యార్థులకు అవగాహన కల్పించాలని కోరారు. అలాగే విమోచన చరిత్ర కు సంబంధిం చిన ప్రదేశాలను గుర్తించి చారిత్రక స్మారక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని, ఉద్యమం లో పాల్గొన్న వీరుల చరిత్రను ప్రజలకు అందుబాటు లోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో మ్యాన రాంప్రసాద్, మెరుగు శ్రీనివాస్, సిద్ధి దేవరాజు, కంబోజు శ్రీధర్, పెళ్లికొండ నరసయ్య, బండారి శ్యామ్, దూడం సురేష్, చొప్పదండి శ్రీనివాస్, అంకారపు రాజు, అభి, కొట్టె భాను, ఎదుల శంకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## "జీవించి సాధించాలి'.. ఆత్మహత్య పరిష్కారం కాదు

**-సైకాలజిస్ట్ కె. పున్నంచందర్.**

**-ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా కార్మికులకు గ్రూప్ కౌన్సెలింగ్.**



సిరిసిల్ల, సెప్టెంబర్ 10 (వాయిస్ టుడే): ప్రపంచ ఆత్మహత్య ల నివారణ దినోత్సవం సందర్భం గా నెహ్రూనగర్ లోని కార్మికులకు ప్రముఖ సైకాలజిస్ట్ కె. పున్నం చందర్ ఆధ్వర్యం లో గ్రూప్ కౌన్సెలింగ్ కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భం గా పున్నం చందర్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన, ఒత్తిడి లేని జీవితాన్ని గడపాలని సూచించారు. సమస్యలు ఎదురై నప్పుడు వాటిని ఒంటరి గా భరించకుండా కుటుంబ సభ్యులు, స్నేహితులు లేదా నిపుణుల తో తమ ఆలోచనలు, భావాలను పంచుకోవాలని కోరారు. "చేంజింగ్ ది నరేటివ్ ఆన్ సూసైడ్స్" అనే సందేశం తో ఆత్మహత్య లపై ప్రజల్లో ఉన్న ఆలోచనా విధానాన్ని మార్చాల్సిన అవసరం ఉందన్నారు. సమస్య ల్లో ఉన్న వ్యక్తుల తో మనస్ఫూర్తి గా మాట్లాడటం, వారి బాధ ను ఓపికగా వినడం, అర్థం చేసుకోవడం, అవసరమైన సమయం లో కౌన్సెలింగ్, మానసిక సహాయం అందించడం ద్వారా ప్రాణాలను కాపాడ వచ్చని తెలిపారు. "ఒక వ్యక్తి బాధ ను తీర్పు చెప్పకుండా ఓపికగా విని అర్థం చేసుకోవడం కూడా ఆత్మహత్యల నివారణ లో ఒక ముఖ్యమైన అడుగు" అని పున్నంచందర్ పేర్కొన్నారు. జీవితం లో ఎన్ని సమస్యలు ఎదురైనా ఆత్మహత్య పరిష్కారం కాదని, ప్రతి సమస్యకు ఏదో ఒక మార్గం లో పరిష్కారం లభిస్తుం దని చెప్పారు. "జీవించి సాధించాలి" అనే ఆత్మ విశ్వాసం తో ముందుకు సాగాలని కార్మికులకు పిలుపునిచ్చారు. సామాజిక కార్యకర్త వేముల మార్కండేయులు మాట్లాడుతూ.. మానసిక లేదా కుటుంబ సమస్యలు ఎదురైనప్పుడు వాటిని నిర్లక్ష్యం చేయకుండా మైండ్ కేర్ అండ్ కౌన్సెలింగ్ సెంటర్ను సంప్రదించి అవసరమైన సహాయం పొందాలని కోరారు. ఆత్మహత్యల నివారణ కోసం మైండ్ కేర్ అండ్ కౌన్సెలింగ్ సెంటర్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమం లో మైండ్ కేర్ అండ్ కౌన్సెలింగ్ సెంటర్ సిబ్బంది రాపెల్లి లత, బూర శ్రీమతి, కొండ ఉమ తదితరులు పాల్గొన్నారు.



## శాయంపేట పోచమ్మకు ఘనంగా బోనాలు

**రూ.90.50 లక్షలతో నిర్మించిన పోచమ్మ రోడ్డుకు ప్రారంభోత్సవం**

**వచ్చే ఏడాదిలో ఆలయ అభివృద్ధికి మరింత ప్రాధాన్యం**

**పశ్చిమనియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని**

హనుమకొండ, సెప్టెంబరు 10 (వాయిస్ టుడే): శాయంపేటలో నిర్వహించిన పోచమ్మ బోనాల వేడుకల్లో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పాల్గొని పోచమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం భక్తులు, స్థానికులతో కలిసి బోనాల వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రూ.90.50 లక్షల వ్యయంతో నిర్మించిన పోచమ్మ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎన్నాళ్లుగా ప్రజలు ఎదుర్కొంటున్న రహదారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా నాణ్యతతో రహదారి నిర్మాణాన్ని పూర్తి చేసినట్లు తెలిపారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో ప్రజలకు అవసరమైన రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు తదితర మౌలిక వసతుల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం, తన కార్యాలయం ప్రాధాన్యం ఇస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని నాయిని తెలిపారు. శాయంపేటలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. వచ్చే ఏడాది నాటికి పోచమ్మ ఆలయ అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి, పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్‌రావు, మాజీ కార్పొరేటర్లు మామిండ్ల రాజు, మోహన్‌రావు, డివిజన్ అధ్యక్షుడు సత్తు రమేష్, నాయకులు రాజు, సురేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## కాజీపేట బస్‌స్టేషన్‌కు కలెక్టర్ స్థల పరిశీలన

**రైల్వే స్థలాలపై కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి పరిశీలన**

**భూమి మార్పిడిపై రైల్వే అధికారులతో చర్చ**

కాజీపేట, సెప్టెంబరు 10 (వాయిస్ టుడే): కాజీపేటలో శాశ్వత ఆర్టీసీ బస్‌స్టేషన్ నిర్మాణానికి ప్రతిపాదిత రైల్వే స్థలాలను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి గురువారం పరిశీలించారు. ప్రయాణికుల సౌకర్యాలను మెరుగుపరిచే లక్ష్యంతో స్థానిక తహసీల్దార్, ఆర్టీసీ, రైల్వే అధికారులతో కలిసి బస్‌స్టేషన్ ఏర్పాటుకు అనువైన ప్రాంతాలను ఆమె పరిశీలించారు. ప్రస్తుతం సిటీ బస్సుల రాకపోకలు కొనసాగుతున్న రైల్వే స్టేషన్ ముందు ప్రాంతం, రైల్వే పాఠశాల స్థలం, రైల్వే స్టేడియం పరిసరాలతో పాటు స్టేడియానికి ఎదురుగా ఉన్న సుమారు ఎకరం రైల్వే భూమిని కలెక్టర్ పరిశీలించారు. అలాగే కాజీపేట ప్రధాన రహదారి పక్కన హైదరాబాద్ వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు నిలిచే ప్రస్తుత ప్రాంతాన్ని కూడా పరిశీలించారు. శాశ్వత బస్‌స్టేషన్ నిర్మాణానికి అవసరమైన భూమిని రైల్వే శాఖ నుంచి సమకూర్చుకోవడం, భూమి మార్పిడి ప్రక్రియను పూర్తి చేయడం తదితర అంశాలపై అధికారులతో కలెక్టర్ చర్చించారు. పర్యటనలో కాజీపేట తహసీల్దార్ రాజు, ఆర్టీసీ ఆర్ఎం భవానీ ప్రసాద్, డిప్యూటీ ఆర్ఎం కిషన్‌రావు, డీఎం ధరమ్‌సింగ్, రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆఫ్ వర్క్స్ శ్రీనివాస్, స్టేషన్ మేనేజర్ రవీందర్, రెవెన్యూ ఆర్ఐ శివ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఐటీ వరంగల్ డైరెక్టర్‌కు 'ఫేస్ ఆఫ్ ఇండియా 2026' గౌరవం

**ఇంజినీరింగ్ విద్య, పరిశోధన, ఆవిష్కరణల్లో విశిష్ట సేవలకు గుర్తింపు**

**'అకడమిక్ విజనరీస్ ఆఫ్ ఇండియా' సిరీస్‌లో ప్రతిష్ఠాత్మక సత్కారం**



కాజీపేట, సెప్టెంబరు 10 (వాయిస్ టుడే): ఎన్ఐటీ వరంగల్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధికి ప్రతిష్ఠాత్మక 'ఇండియాస్పార్క్ ఫేస్ ఆఫ్ ఇండియా 2026' గుర్తింపు లభించింది. ఇంజినీరింగ్ విద్య, పరిశోధన, ఆవిష్కరణలు, సంస్థాగత నాయకత్వ రంగాల్లో ఆయన అందిస్తున్న విశిష్ట సేవలకు గుర్తింపుగా ఇండియాస్పార్క్ ఆధ్వర్యంలోని 'అకడమిక్ విజనరీస్ ఆఫ్ ఇండియా' సిరీస్‌లో భాగంగా ఈ గౌరవానికి ఎంపిక చేశారు. మూడు దశాబ్దాలకు పైగా విద్యా, పరిశోధనా రంగాల్లో అనుభవం కలిగిన ప్రొఫెసర్ సుబుధి స్మార్ట్ గ్రిడ్లు, పునరుత్పాదక ఇంధనం, ఎలక్ట్రిక్ వాహన సాంకేతికత వంటి ఆధునిక రంగాల్లో పరిశోధనలు చేస్తున్నారు. 300కు పైగా పరిశోధనా పత్రాలు ప్రచురించడంతో పాటు ఆరు పుస్తకాలు రచించారు. ఐదు పేటెంట్లు ఆయన పేరిట ఉండగా, 46 మందికి పైగా పీహెచ్‌డీ విద్యార్థులకు మార్గదర్శకత్వం అందించారు. ప్రతిష్ఠాత్మక జె.సి. బోస్ ఫెలోషిప్‌తో పాటు ఐఎన్ఏఈ, ఐఈటీ (యూకే) సంస్థల ఫెలో గా కొనసాగుతున్నారు.

2023 నుంచి ఎన్ఐటీ వరంగల్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న సుబుధి సంస్థలో పరిశోధన, ఆవిష్కరణలు, డిజిటల్ గవర్నెన్స్‌ను బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించారు. యువ పరిశోధకులకు ప్రోత్సాహం అందించడంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో విద్యా, పరిశోధనా సహకారాలను విస్తరిస్తున్నారు. ఈ సందర్భంగా ఇండియాస్పార్క్ వ్యవస్థాపకురాలు, సీఈఓ రూపా తంతి మాట్లాడుతూ ఎన్ఐటీ వరంగల్‌లో ప్రొఫెసర్ సుబుధి అందిస్తున్న పరివర్తనాత్మక నాయకత్వం, సుస్థిర ఇంధన రంగంలో ఆయన పరిశోధనలు భారత ఆవిష్కరణ స్ఫూర్తిని ప్రతిబింబిస్తున్నాయని పేర్కొన్నారు.

వాయిస్ ఆఫ్ ప్రజలు
హైదరాబాద్
శుక్రవారం 11 సెప్టెంబరు 2026

# 22ఏ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలి

**బాధ్యులపై కఠినమైన చర్యలు తీసుకోవాలి**

**బీజేపీ మండల అధ్యక్షుడు చింతం శ్రీనివాస్**



తిమ్మాపూర్,సెప్టెంబర్ 10(వాయిస్ టుడే): తెలంగాణ వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న 22ఏ (నిషేధిత భూములు) జాబితా అక్రమాలు,అవకతవకలపై,వేలాది మంది రైతులు,భూ యజమానుల ఆస్తి హక్కులను కాలరాస్తున్న ఈ భారీ కుంభకోణంపై సమగ్ర విచారణ జరపాలని, బాధ్యులపై కఠినమైన చర్యలు తీసుకొని,ఈ తప్పిదాలకు నైతిక బాధ్యత వహిస్తూ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రాజీనామా చేయాలని బీజేపీ జిల్లా కార్యదర్శి చేపూరి సత్యం,మండల అధ్యక్షులు చింతం డిమాండ్ చేశారు. ప్రోగ్రాంకు ముఖ్య అతిథిగా హాజరైన బిజెపి కార్యదర్శి చేపూరి సత్యం,చింతం శ్రీనివాస్, మండల బిజెపి శ్రేణులతో కలిసి ఎమ్మార్వోకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 22ఏ నిషేధిత భూముల జాబితాలో జరిగిన భారీ అవకతవకలను కేవలం పరిపాలనా తప్పిదంగా కాకుండా,ఒక వ్యవస్థీకృత కుట్రగా పరిగణించి న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.వేలాది మంది భూ యజమానులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన ఈ భారీ కుంభకోణానికి నైతిక బాధ్యత వహిస్తూ రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.ధరణి/భూభారతి పోర్టల్స్‌లో గత ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు జరిగిన మార్పులు, చేర్పులపై డిజిటల్ ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలన్నారు.మండల వారీగా 22ఏ భూముల వివరాలను, గ్రామం,సర్వే నంబర్ల వారీగా బహిర్గతం చేసి పూర్తిస్థాయి శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు.తప్పుగా నిషేధిత జాబితాలో చేరిన ప్రైవేటు,పట్టా భూములను వెంటనే తొలగించి, బాధితులకు న్యాయం చేయడానికి ప్రత్యేక గ్రీవెన్స్ రిడ్రెస్సల్ మెకానిజం ఏర్పాటు చేయాలన్నారు. రికార్డులను ఉద్దేశపూర్వకంగా మార్చిన అధికారులు,మధ్యవర్తుల పాత్రపై విచారణ జరిపి శాఖాపరమైన చర్యలతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించకపోతే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా చేపూరి సత్యనారాయణ,బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర,మండల అధ్యక్షుడు చింతం శ్రీనివాస్,కిసాన్ మోర్చ జిల్లా ఉపాధ్యక్షుడు బోనాల మోహన్, గొట్టిముక్కల తిరుపతి రెడ్డి,ఓబిసి మోర్చ జిల్లా నాయకులు కొయ్యడ శ్రీనివాస్, బీజేవైఎం మండల అధ్యక్షుడు గడ్డం అరుణ్,దుర్శేటి రమేష్,గడ్డం శ్రీనివాస్ రెడ్డి,రామిడి మహేందర్ రెడ్డి,గాండ్ల రాము, బుర్ర శ్రీనివాస్ గౌడ్,జాడి రాజు,బండి స్వామి,బూరుగు శ్రీనివాస్ రెడ్డి, దళిత మోర్చ మండల అధ్యక్షుడు ఎల్కపల్లి స్వామి,కుమార్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## మన సనాతన హిందూ సేవా సమితి 2వ వార్షికోత్సవం

వరంగల్ ( వాయిస్ టుడే ) సెప్టెంబర్ 10 : సనాతన హిందూ సేవా సమితి 232 వ సేవా కార్యక్రమం లో భాగంగా వరంగల్ కరీమాబాద్ లోని బొమ్మల గుడి గోశాల లోనీ గోమాతలకు ఒక క్వింటల్ దాన అందించడం జరిగింది. ఈ కార్యక్రమం లో గ్రూప్ వ్యవస్థాపకుడు తాళ్లపల్లి నగేష్ అధ్యక్షుడు మిట్టపెల్లి వేణు,సలహాదారు అంచూరి వేణు గోపాల్, గ్రూప్ సభ్యులు గంగిడి ధర్మారెడ్డి,బండారి సంపత్, ఆకుతోట కిరణ్,విరాటి ప్రకాష్ రెడ్డి, పాల్గొన్నారు.



## చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

**- సిరిసిల్లలో ఘనంగా చాకలి ఐలమ్మ వర్ధంతి.**

**- అన్యాయాన్ని ఎదిరించి హక్కుల కోసం పోరాడిన వీరవనిత: జిందం కళ చక్రపాణి.**

సిరిసిల్ల, సెప్టెంబర్ 10 (వాయిస్ టుడే): సిరిసిల్ల రజక సంఘం ఆధ్వర్యం లో చాకలి ఐలమ్మ చౌరస్తా లో నిర్వహించిన చాకలి (చిట్యాల) ఐలమ్మ వర్ధంతి కార్యక్రమం లో మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ చక్రపాణి పాల్గొని ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిందం కళ చక్రపాణి మాట్లాడుతూ.. బడుగు, బలహీన వర్గంలో జన్మించిన చాకలి ఐలమ్మ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో రజాకార్ల దోపిడీ, దౌర్జన్యాలకు ఎదురు తిరిగి హక్కుల సాధన కోసం పోరాడిన గొప్ప యోధురాలని అన్నారు. తెలంగాణ వీరవనిత చాకలి ఐలమ్మ అన్యాయాన్ని ఎదిరిస్తూ సాగించిన వీరోచిత పోరాటం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఐలమ్మ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమం లో సిరిసిల్ల రజక సంఘం అధ్యక్షుడు దండు శ్రీనివాస్,నెహ్రూనగర్ రజక సంఘం అధ్యక్షుడు మారుపాక శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కాసర్ల మహేందర్, సీహెచ్. బాలరాజు, దండు ఎల్లయ్య, వేములవాడ శ్రీనివాస్‌తో పాటు రజక కుల బాంధవులు పాల్గొని చాకలి (చిట్యాల) ఐలమ్మ కు నివాళులర్పించారు.



## బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్ ఎత్తి వేయాలి: తోట ఆగయ్య

**రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతోంది: బీఆర్ఎస్ నేతల విమర్శలు**

సిరిసిల్ల, సెప్టెంబర్ 10 (వాయిస్ టుడే): శాసనసభ లో బీఆర్ఎస్ ఎమ్మెల్యే లపై విధించిన సస్పెన్షన్ ను వెంటనే ఎత్తివేయాలని బీఆర్ఎస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య డిమాండ్ చేశారు. సిరిసిల్ల తెలంగాణ భవన్ లో నిర్వహించిన బీఆర్ఎస్ నేతల మీడియా సమావేశం లో ఆయన మాట్లాడారు.ఎమ్మెల్యేల సస్పెన్షన్ ను తీవ్రంగా ఖండిస్తున్నామని, సీఎం రేవంత్ రెడ్డి దౌర్జన్యం గా వ్యవహరిస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని తోట ఆగయ్య ఆరోపించారు. న్యాయ స్థానాలు జోక్యం చేసుకుని ఎమ్మెల్యేల సస్పెన్షన్ ఎత్తివేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డి తమ పార్టీ నేతలు, కేసీఆర్, కేటీఆర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే లపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు. కేసీఆర్ నివాసంపై కాంగ్రెస్ కార్యకర్తల దాడి ఘటనను తీవ్రం గా ఖండి స్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణ సాధన కోసం కేసీఆర్ 14 ఏళ్ల పాటు రాజీలేని పోరాటం చేశారని తోట ఆగయ్య అన్నారు.బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. సెప్టెంబర్ 1 నుంచి వారం రోజుల పాటు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యా లను ప్రజల ముందుకు తీసు కెళ్లామని తెలిపారు. ప్రజలు రేవంత్ రెడ్డి పాలన వద్దనే స్థితికి వచ్చారని, దీనిని జీర్ణించుకోలేక ప్రభుత్వం దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతోందని ఆరోపించారు. అసెంబ్లీ ఎదుట బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు దాడులకు పాల్పడుతున్నారని గూడూరి ప్రవీణ్ విమర్శించారు. శాసనసభలో బీఆర్ఎస్ఎమ్మెల్యే లపై విధించిన సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశం లో మున్సిపల్ వైస్ చైర్మన్ దార్ల సందీప్, బొల్లి రామ్మోహన్, మీసరగండ్ల అనిల్ కుమార్, కుంబాల మల్లారెడ్డి, రాజు, మ్యాన రవి, బాలమల్లు, సాయికుమార్, కందుకూరి రామగౌడ్, అనిల్ గౌడ్, మొగిలి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## మట్టి వినాయక విగ్రహాలను పూజించాలి

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఉచితం గా మట్టి వినాయక విగ్రహాల పంపిణీ**

సిరిసిల్ల, సెప్టెంబర్ 10 (వాయిస్ టుడే): పర్యావరణ పరిరక్షణ లో భాగంగా మట్టి తో తయారు చేసిన వినాయక విగ్రహాల ను ప్రతిష్టించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపు నిచ్చారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం లో గురువారం జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితె ప్రారంభించారు. అనంతరం పోస్టర్లు ఆవిష్కరించారు. 2 వేల విగ్రహాలను పంపిణీ చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గణేష్ నవరాత్రి ఉత్సవాలను పర్యావరణ హితంగా నిర్వహించాలని సూచించారు. ముఖ్యం గా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో తయారు చేసిన వినాయక విగ్రహాలకు బదులుగా మట్టి వినాయక విగ్రహాలను వినియోగించాలని కోరారు పర్యావరణహితమైన గణేష్ నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని, ప్రకృతి, జలవనరులను కాపాడుతూ భక్తిశ్రద్ధ లతో పండుగను చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపు నిచ్చారు.కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆయా శాఖల అధికారులు, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఏఈఈ శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థుల మధ్య రెడ్డవేణి రితన్య పుట్టిన రోజు పాఠశాలలో క్రీడా దుస్తుల పంపిణీ

కొత్తపల్లి,సెప్టెంబర్ 10 (వాయిస్ టుడే):మాజీ ఎఎంసి చైర్మన్ రెడ్డవేణి మధు కూతురు రెడ్డవేణి రితన్య పుట్టిన రోజు వేడుకలు పాఠశాల విద్యార్థుల మధ్య నిర్వహించారు.ఈ సందర్భంగా కొత్తపల్లి మండలం ఖజీపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పిల్లి శ్రీలత మహేష్,గ్రామ సర్పంచ్ అంజన్ కుమార్,ఉప సర్పంచ్ రమేష్,వార్డ్ మెంబర్లు,ప్రజా ప్రతినిధులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## దళితులు నడిస్తే నేల మైల పడిపోతుందా?

**బిఆర్ఎస్ శుద్ధికరణ కార్యక్రమంపై ఎస్సీ సెల్ ఫైర్**



కరీంనగర్,సెప్టెంబర్ 10(వాయిస్ టుడే): కెసిఆర్ ఫామ్ హౌస్ వద్ద దళితులు నడిచిన రోడ్డు అపవిత్రమైందంటూ పాలు,పసుపు నీళ్లతో శుద్ధి చేసిన బిఆర్ఎస్ నాయకులపై వెంటనే ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసు నమోదు చేయాలని కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు కొరివి అరుణ్ కుమార్ ఏసిపి కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కొరివి అరుణ్ కుమార్ మాట్లాడుతూ స్పీకర్ గడ్డం ప్రసాద్ పై బిఆర్ ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా, టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర చైర్మన్, మానకొండూర్ శాసనసభ్యులు డా. కవ్వంపల్లి సత్యనారాయణ గారి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా 1000 డప్పులతో కెసిఆర్ ఫామ్ హౌస్ వద్ద శాంతియుతంగా నిరసన కార్యక్రమం నిర్వహించాము.ఆ కార్యక్రమం అనంతరం బిఆర్ ఎస్ నాయకులు అది పుణ్యపురుషుడు నివసించే పుణ్యభూమి అని, దళితులు ఆ రోడ్డుపై నడవడం వల్ల నేల అపవిత్రమైందని చెప్పి పాలు, పసుపు నీళ్లతో శుద్ధి చేయడం అత్యంత దారుణం,సిగ్గుచేటు. మొన్న హల్ద్వానీలో,నిన్న ఎర్రవెల్లిలో జరిగిన ఈ సంఘటనలు ఈ దేశంలో దళితుల ప్రస్తుత స్థితికి అద్దం పడుతున్నాయి.80 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో దళితులు ఇంకా అంటరానివారేనా? అని ప్రశ్నించాల్సి వస్తోంది.దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని మోసం చేసి గద్దెనెక్కిన కేసీఆర్,తెరాస నాయకులు నిన్న చేసిన శుద్ధికరణ కార్యక్రమానికి ఏం సమాధానం చెప్తారు? రేపు ఏ ముఖం పెట్టుకొని దళితుల ఓట్లు అడుగుతారు? దళితులు ఆకలితో అయినా చస్తారు గానీ ఆత్మగౌరవానికి భంగం కలిగితే చూస్తూ ఊరుకోరు. బిఆర్ఎస్ నాయకుల ఇళ్లు ముట్టడించి వారు జరిపిన శుద్ధి కార్యక్రమంపై వివరణ కోరుతాం. బిఆర్ఎస్ పార్టీలో ఉన్న దళితులు ఆత్మవిమర్శ చేసుకోవాలి.ఇది కేవలం కాంగ్రెస్ కార్యకర్తలకు జరిగిన అవమానం కాదు,యావత్ దళిత సమాజానికి జరిగిన అవమానం.వెంటనే కేసీఆర్, బిఆర్ఎస్ నాయకులు బహిరంగంగా క్షమాపణ చెప్పాలి. లేకపోతే వారి ఇంటి ముందు చావు డప్పులు కొడతాం.బిఆర్ఎస్ చేసిన ఈ శుద్ధికరణ కార్యక్రమం కచ్చితంగా కుల వివక్షే.ఇలాంటి చర్యలు పునరావృతమైతే పర్యవసానం తీవ్రంగా ఉంటుంది, దళిత సమాజం చూస్తూ ఊరుకోదు అని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర వైస్ చైర్మన్ ములకల మల్లేశం,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సముద్రాల లక్ష్మణ్,జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండీ తాజుద్దీన్, జిల్లా ఎస్టి సెల్ అధ్యక్షులు శ్రావణ్ నాయక్,ఎస్సీ సెల్ జిల్లా వైస్ చైర్మన్లు దుబ్బాసి కుమార్,గొట్టే బాబు,రూరల్ ఎస్సీ సెల్ అధ్యక్షులు మీసాల సాయిలు,జిల్లా ప్రధాన కార్యదర్శి కనకం విద్యాసాగర్, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం వాసు,సిటీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వెన్నం రజిత రెడ్డి, మానకొండూర్ యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు కోంద్ర సురేష్, ఎస్సీ సెల్ నాయకులు జీడి రమేష్, హస్త పురం తిరుమల,తీట్ల ఈశ్వరి, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ మాజీ అధ్యక్షులు అబ్దుల్ రెహమాన్ పాల్గొన్నారు.

## గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక తీజ్ పండుగ

**మేయర్ కొలగాని శ్రీనివాస్**



కరీంనగర్,సెప్టెంబర్ 10(వాయిస్ టుడే): నగరంలోని 11వ డివిజన్‌లో ఘనంగా నిర్వహించిన తీజ్ పండుగ వేడుకల్లో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా తీజ్ పండుగ ప్రాధాన్యతను వివరిస్తూ,వేడుకల్లో పాల్గొన్న మహిళలు,గిరిజన కుటుంబాలకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ తీజ్ పండుగ గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు,ఆచారాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఈ పండుగ కుటుంబాల్లో సుఖసంతోషాలు,సౌభాగ్యం, ఐక్యత వెల్లివిరియాలని ఆకాంక్షించే పవిత్ర పర్వదినమని తెలిపారు.తీజ్ పండుగ ద్వారా తరతరాలుగా వస్తున్న గిరిజన సంప్రదాయాలు, సంస్కృతిని కాపాడుతూ భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కరీంనగర్ నగరంలో అన్ని వర్గాల ప్రజలు తమ సంస్కృతి, సంప్రదాయాలను స్వేచ్ఛగా, ఘనంగా నిర్వహించుకునేలా అవసరమైన సహకారం అందిస్తామని మేయర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆకుల నర్మదా నర్సయ్య,పొన్నం లక్ష్మి,మొండయ్య,బీజేపీ నాయకులు పండుగ నాగరాజు, ఆవునూరి భరత్, గిరిజన నాయకులు గూగులోత్ తిరుపతి నాయక్,కాలనీ వాసులు, మహిళలు,యువత పాల్గొన్నారు.

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**